జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | సోమవారం 25 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 78 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: దశమి - 29:13:24 వరకు నక్షత్రంఉత్తరఫల్గుణి - 28:09:21 వరకు కరణంతైతిల - 16:49:06 వరకు, గర - 29:13:24 వరకు పక్షంశుక్ల యోగంవజ్ర - 27:14:28 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### యురేనియం అప్పగించేందుకు ఇరాన్ సిద్ధం!

**త్వరలోనే అధికారికంగా ప్రకటన వెలువడే చాన్స్**
**హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి**

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలను ముగించే దిశగా కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన

మిగతా1 2లో..

### నేటినుండి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర

రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద నేటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం

మిగతా 2లో..

# త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ!?

## కేబినెట్ ప్రక్షాళన దిశగా అడుగులు

## ఏపీ, బీహార్ మిత్రపక్షాలకు చోటు!

## కీలక పదవులు ఇచ్చే అవకాశం



**మోదీ 3.0 ప్రభుత్వం మరో కొన్ని రోజుల్లో రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకోనుంది. ఈ కీలక మైలురాయిని పురస్కరించుకుని కేంద్రమంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులకు అంతర్గతంగా చకచకా సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత శాఖల వారీగా మంత్రుల పనితీరుపై ప్రధాని మోదీ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్యాల సాధన, పరిపాలనా బాధ్యతల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని శాఖల పేలవమైన పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. మంత్రులు, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దేశ పురోభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనిక క్రమశిక్షణతో పని చేయాలని, ప్రజాధనాన్ని వీలైనంతగా పొదుపు చేయాలని స్పష్టం చేశారు.**

మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థ పనితీరు మారాలని, వికసిత భారత్ లక్ష్యం కోసం రంగాల వారీగా దూసుకుపోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈసారి జరగబోయే పునర్వ్యవస్థీకరణలో దాదాపు 20 నుంచి 30 మంది మంత్రుల వరకు మార్పులు చేర్పులు ఉండవచ్చని ఢిల్లీ వర్గాల సమాచారం. పనితీరు సరిగ్గా లేని కొందరు సీనియర్లను తప్పించి, వారి స్థానంలో కొత్త ముఖాలకు, ముఖ్యంగా యువత, మహిళలకు కేబినెట్‌లో చోటు కల్పించే యోచనలో బీజేపీ అధిష్ఠానం ఉంది. గతంలో మోదీ 2.0 హయాంలో జూలై 7, 2021న జరిగిన అతిపెద్ద కేబినెట్ ప్రక్షాళనలో 43 మంది కొత్త మంత్రులు ప్రమాణం చేయగా, 12 మంది సీనియర్లకు ఉద్వాసన పలికారు. ఇప్పుడు కూడా అదే తరహాలో గట్టి నిర్ణయాలు తీసుకోనున్నారు. అయితే రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో పట్టున్న కొందరు అనుభవజ్ఞులైన సీనియర్ నేతలకు మళ్లీ కేబినెట్‌లో చాన్స్ ఇవ్వనున్నారు. రాబోయే 2027 నాటికి దేశంలోని ఏడు కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి–మార్చి నెలల్లోనే ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాలకు.. అలాగే ఈ ఏడాది నవంబర్–డిసెంబర్‌లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండటంతో ఆయా రాష్ట్రాల నుంచి గెలిచిన నేతలకు కేంద్ర కేబినెట్‌లో సముచిత స్థానం దక్కనుంది. మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలనే వ్యూహంలో భాగంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా

మిగతా 2లో..

## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు..

- పెట్రోల్ లీటరుకు రూ.2.61 పెంపు
- డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంపు
- 10 రోజుల వ్యవధిలో నాలుగోసారి పెంపు



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు భారత్ సహా పలు దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నెలలో ఇదివరకే మూడుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచగా.. తాజాగా మరోసారి ఇంధన ధరలు పెరిగాయి. సోమవారం (25 మే 2026) ఉదయం 6 గంటల నుంచి పెరిగిన ధరలు అమలులోకి రానున్నాయి. పెట్రోల్ లీటరుకు రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దేశ రాజధాని

మిగతా 12లో..

### పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి

**బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో రైలుపై దాడి**

**24 మంది మృతి, పలువురికి గాయాలు**

మృతుల్లో ఎక్కువ మంది సైనికులే పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా ప్రాంతంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన భారీ బాంబు దాడిలో కనీసం 24 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికిపైగా గాయపడినట్లు

మిగతా 12లో..

## ధాన్యం కొనుగోలు వేగం పెంచాలి

- ధాన్యం ఉత్పత్తి తెలంగాణలోనే అధికం
- రైతులను మోసంచేస్తే కఠిన చర్యలు
- రైతు అనుకూల విధానాలు అమలు
- ధాన్యం తడిచినా అధికారులు కొనాల్సిందే
- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కలెక్టర్లకు పౌరసరఫరాల మంత్రి సూచన




రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని అన్ని జిల్లా కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు, శాసన సభ్యులకు పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ సూచించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల భవనంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. జిల్లాల నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ సహా కలెక్టర్లు స్థానికంగా కొనుగోలు చేసిన వివరాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సీఎస్ కృష్ణారావు సైతం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని దేశ చరిత్రలో ఎ

మిగతా 2లో..



# ఘనంగా టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మ దిన వేడుకలు

రైతులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి





**ఆదిలాబాద్ బ్యూరో, మే 24, (ప్రజా జ్యోతి) :** టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆదిలా బాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో బెజ్జనికి అనిల్ కుమార్ మాజీ టీటీడీ బోర్డు మెంబెర్, ఏఎంసీ బోర్డు మెంబెర్ కొరటి ప్రభాకర్, మూడేళ్ళ పోశెట్టి, తాటి అశో క్, టౌన్ ప్రెసిడెంట్ ఖిజర్ పా షా జిల్లా కాంగ్రెస్ కోశాధికారి అభిషేక్ రెడ్డి, అలీం, అజీజ్ భాయ్ , రైతులతో కలిసి శ్రీకాం త్ రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్త లు, రైతులకు కేక్ తినిపించా రు. అనంతరం బొమ్మ మహే ష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. రై తులు, కాంగ్రెస్ నాయకులు శ్రీ కాంత్ రెడ్డికి కేక్ తినిపిస్తూ ఆ నందం వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లా డుతూ బొమ్మ మహేష్ కుమా ర్ గౌడ్ పార్టీ బలోపేతంతో పా టు రైతుల సంక్షేమం కోసం కూడా కృషి చేసే నాయకుడని అన్నారు. కార్యకర్తలకు, ప్రజ లకు ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసు కెళ్తున్నారని తెలిపారు. ఆయ నకు ఆయురారోగ్యాలు కలిగి మరిన్ని ఉన్నత పదవులు ద క్కాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారాల్లో మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు

– డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుర సత్యం



**ఖానాపూర్ మే 24 (ప్రజా జ్యోతి) :** ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారాల్లో మధ్య దళారులను నమ్మి మోసపోరాదని డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుర సత్యం అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎమ్మెల్యే, లేదా స్థానిక కౌన్సిలర్ లను గాని కాంగ్రెస్ పార్టీ నాయకులు సంప్రదించాలని కోరారు. అయితే మధ్యవర్తి దళారులు పేదప్రజలవద్ద డబ్బులు అడుగుతున్నట్టు తమకు సమాచారం అందిందనితెలిపారు ప్రజలు ఎవ్వరూ మధ్యవర్తి దళారులను నమ్మవద్దు అని అన్నారు. అదేవిధంగా ప్రజా ప్రభుత్వం త్వరలో అందించే భరోసా పింఛను పథకం దరఖాస్తు కోసంసైతం ఎటువంటి విధి విధానాలు రాలేవని దీనికి మధ్య వ్యక్తులు ప్రజలను మందు బట్టి పెన్షన్లు ఇప్పిస్తామని మోసం చేస్తారని తెలిపారు కార్యక్రమంలో కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆత్మ కమిటీ చైర్మెన్ తోట సత్యం మండల అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ .,డీసీసీ అధికార ప్రతినిధి దోని కేని దయానంద్ కార్యదర్శి అంకం రాజేందర్ కార్యవర్గ సభ్యులు జన్నారపు శంకర్,నేరేళ్ల సత్యనారాయణ, ధ్యావతి రాజేశ్వర్ లాలూ నాయక్,కావాలి సంతోష్, శౌకత్ పాషా.మడిగేల గంగాధర్ డీలర్ రాజేందర్ ,దాసరి రాజన్న, శేషాద్రి, దాసరి రాజేశ్వర్ గుడిమందుల శ్రీహరి ములుగురి శ్రీహరి తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు

# సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

– సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక కోటాలో 150 సీట్లు

**మంచిర్యాల, 24, మే (ప్రజాజ్యోతి) :** పాలిటెక్నిక్ కళాశాలలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేక కోటా సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ఆదివారం నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సింగరేణి ఉద్యోగుల వారసుల కోసం ప్రత్యేకంగా మొత్తం 150 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో సివిల్ ఇంజినీరింగ్‌లో 30, కంప్యూటర్ సైన్స్‌లో 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్‌లో 30, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 30, మైనింగ్ ఇంజినీరింగ్‌లో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రత్యేక కోటా సీట్లకు సింగరేణి ఉద్యోగుల వారసులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ నెల 24 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులను ంఎజూ.ంఎజూశీశ్రీవ్‌వఎష్ట్రఅఅ.ఎశీఎ? ద్వారా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే 8790112515, 9908151618, 9010222161 నంబర్లను సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

# పేదప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, 24, మే (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్ మండల బుద్దిపల్లి (కొండాపూర్) గ్రామానికి చెందిన ఏ. అంజయ్యకు ఆరోగ్య చికిత్స ఖర్చుల నిమిత్తం 2 లక్షల 50 వేల విలువైన ఎల్‌వోసీ చెక్కును మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్‌వోసీ వంటి పథకాల ద్వారా సహాయం అందిస్తున్నామన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే సాగరన్న అన్నారు. ఈ సహాయం అందడంతో అంజయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

– తరుగు పేరిట కోతలు విధిస్తే చర్యలు – మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 24, (ప్రజాజ్యోతి) :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల వారీగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట స్థానిక హమాలీలను నియమించుకోవాలని, రవాణా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్లు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తాలు, తరుగు పేరిట రైతుల ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదేవిధంగా "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. 'మహిళా ఉన్నతి -- తెలంగాణ ప్రగతి' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేసి, రోజువారీ లక్ష్యాలను సాధించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మహిళా వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ప్రతిరోజూ కార్యక్రమాలను మహిళలు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు వడదెబ్బతో ఆగుతున్న గుండెలు

– నేటి నుండి రోహిణి కార్తె బండరోళ్లు పగిలేలా ఎండలు – జాగ్రత్త వహించాలంటున్న పెద్దలు

**ఖానాపూర్ మే 24(ప్రజా జ్యోతి) :**

భగభగ మండుతున్న ఎండల్లో తట్టుకోలేక వడదెబ్బతో నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, ముధోల్,నిర్మల్ నియోజకవర్గం లోని పలు గ్రామాల్లోఇప్పటికే సుమారు 30 మంది వడదెబ్బలతో మరణించినట్లు తెలిసింది. అయితే వేసవికాలం ఆరంభం నుండే దంచి కొడుతున్న ఎండల్లో వడదెబ్బల్లో మనుషులకే ఇబ్బందులు కాకుండా ఎండ తీవ్రతకు కరెంటు షాక్ సర్క్యూట్ తో ట్రాన్స్ఫార్మర్ల వేడితో పాటు పంట చేలలో బిగించిన మోటార్లు పరస్పర విద్యుత్ వైర్ల కలయికతో షాక్ వల్ల ఖానాపూర్, కడం,పెంబి, దస్తురాబాద్,మండలాల్లో పంటలు సైతం దగ్ధమై రైతులు తీవ్రంగా నష్టపోయారు ఈ మేరకు విద్యుత్ అధికారులు సైతం జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఎండ తీవ్రతను గుర్తించి సూచిక గోడ ప్రతులను గ్రామాల్లో అంటించారు ఉదయం 8 గంటల అయిందంటే 31 డిగ్రీల తాకిడి నుండి ప్రారంభమై 41 నుంచి 44 వరకు ఎండ తీవ్రత పెరుగుతూ వస్తూ సాయంత్రం 7:00లకు సైతం వేడి వడగాలులతో ప్రజల్ని ఎండలు ఊపిరాడ కుండా చేస్తున్నాయి. ఎండల తీవ్రత వల్ల ప్రజల సంచారాలు లేక గ్రామాలు పట్టణాలు మధ్యాహ్నం వేళ పదసంచారకులు లేకుండా ప్రజల సందడి లేకుండా రోడ్లు వెలవెలబోయినాయి

**రోహిణి కార్తె ప్రారంభం జర జాగ్రత్త వహించాలంటున్న పెద్దలు :** సూర్యుడు రోహిణి నక్షత్రంలో ప్రవేశించినప్పుడు రోహిణి కార్తె అంటారు ఈ సమయంలో ఎండ తీవ్రత అత్యధికంగా అవుతుంది కాబట్టే ఇది రోహిణి కార్తె ఎండలని ఈ రోహిణి కార్తెలో రోళ్లు సైతం పగిలే ఎండలు కొడతాయి అన్న సామెత ప్రచారంలోకి వచ్చిందని ఈ మేరకు ఈ రోహిణి కార్తె మే 25 నుండి జూన్ 8 వరకు తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఎండ తాకిడి తట్టుకునేందుకు పలు జాగ్రత్తలు వహించాలని పెద్దలు సూచిస్తున్నారు ఈ కార్తెలో రాళ్లు సైతం పగలే ఎండలు ఉండడం వల్ల మానవమాత్రులైన మనుషులు పశుపక్షాదులు జంతువులు ఎండ తాకిడి తట్టుకోలేక ప్రమాదాలు కలిగే అవకాశం ఉన్నందున సాధ్యమైనంతవరకు ప్రజలు అనవసరంగా రోడ్ల వెంట తిరగకుండా అత్యంత జాగ్రత్తగా పనులుంటే చేసుకోవాలని కోరుతున్నారు ఈ మేరకు జిల్లా కలెక్టర్ తో పాటు మండల స్థాయి రెవెన్యూ మండల ప్రజా పరిషత్ అధికారులు పార్టీల కతి తంగా వివిధ ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రజలు సురక్షితంగా ఉండాలని బాహటంగా ప్రకటనలు చేస్తున్నారు దీన్ని గమనించి ఈ 15 రోజుల రోహిణి కార్తెలో జాగ్రత్త వహించి ఎండల్లో తిరిగి వడదెబ్బకు బలికాకుండా ఉండాలని పలువురు కోరుతున్నారు.

# రాముని చెరువు రక్షణలో అధికారుల వైఫల్యం...

– అమృత్ నిధులు దుర్వినియోగం చేస్తూ చెరువు ఉనికినే ప్రమాదంలోకి నెడుతున్నారు

– బిజెపి సీనియర్ నాయకుడు తులా మధుసూదన్ రావు




**మంచిర్యాల, 24, మే (ప్రజా జ్యోతి) :** రాముని చెరువు అభివృద్ధి పనుల పేరుతో అమృత్ పథకం నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని, చెరువు పరిరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ నాయకుడు తులా మధుసూదన్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం రాముని చెరువు కట్టపై బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంను బిజెపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తులా మధుసూదన్ రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణ కోసం అమృత్ పథకం కింద రాముని చెరువుకు 1 కోటి 98 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే అధికారులు ఆ నిధులను చెరువు రక్షణకు అవసరమైన పనులపై ఖర్చు చేయకుండా, అనవసర పనుల పేరుతో బడ్జెట్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు హైటెక్ సిటీ వైపు చెరువును కొద్దికొద్దిగా పూడ్చే కార్యక్రమాన్ని కొందరు దుర్మార్గులు కొనసాగిస్తున్నారని, చెరువు ఉనికికే ముప్పు ఏర్పడుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. అలాంటి ఆక్రమణలను అడ్డుకుని చెరువును కాపాడాల్సిన అధికారులు ప్రస్తుతం ఉన్న కట్టపై రాళ్లను తీసి తిరిగి అవే రాళ్లను అమర్చే పనులు చేపట్టడం వల్ల అమృత్ పథకం అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు రాముని చెరువులోని కొంతభాగాన్ని ఇస్తామని అధికారులు ప్రకటించడం తీవ్రంగా తప్పుబట్టారు. చెరువులను పూడ్చి మైదానాలుగా మార్చడం పూర్తిగా చట్ట విరుద్ధమని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాముని చెరువు అంశంపై లోకాయుక్తలో కేసు నడుస్తోందని గుర్తుచేస్తూ, చెరువు మధ్యలో నిర్మించిన రోడ్డును తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు చెరువును రక్షించే చర్యలు చేపట్టకుండా, వచ్చిన నిధులను నిరుపయోగకరమైన పనులపై ఖర్చు చేస్తూ సొమ్మును కాజేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రస్తుతం జరుగుతున్న పనులను నిలిపివేయాలని కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యే ఈ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చెరువుకు సంబంధించిన 47 ఎకరాల 32 గుంటల భూమిని పూర్తిగా గుర్తించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద పౌరశాస్త్రం అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య మాట్లాడుతూ, అధికారులు నిధులు ఖర్చు చేయడంలో చూపుతున్న శ్రద్ధ, చెరువును భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడంపై లేదని విమర్శించారు. జల సంరక్షణపై జాతీయ స్థాయి అవార్డు పొందిన జిల్లా కలెక్టర్ ఈ విషయంలో స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం చెరువులో జరుగుతున్న పనులను తక్షణమే నిలిపివేసి, చెరువు చుట్టూ కంచె నిర్మాణం చేసి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మున్నారాజ్ సిసోడియా, కర్రె లచ్చన్న, స్వచ్ఛంద పౌర సేవా సంస్థ సభ్యులు కనుకుంట్ల మల్లయ్య, యోగా గురువు దామర రాజయ్య, నాయకులు బోయిన హరికృష్ణ, పోరండ్ల రమేష్ రెడ్డి, గుండా సురేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ విశ్రాంత ఉద్యోగులకు

# సింగరేణి ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలి

సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసిన విశ్రాంత ఉద్యోగుల సంఘం



**మంచిర్యాల, 24, మే (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థలో గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పథకం కింద పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో నాయకులు మాట్లాడారు. సింగరేణి సంస్థలో 25 నుంచి 27 సంవత్సరాల పాటు బొగ్గు గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి, తమ రక్తాన్ని చమటగా మార్చి సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ఉద్యోగులు గత సీమాంధ్ర ప్రభుత్వ కాలంలో తప్పనిసరి పరిస్థితుల్లో గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పథకం కింద పదవీ విరమణ చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం వీరిలో చాలామంది బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, కీళ్ల వ్యాధులు, గుండె, లివర్, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో వారికి సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడం అత్యవసరమని సమావేశం అభిప్రాయపడింది. గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ ఉద్యోగుల్లో చాలామంది నెలకు 350 నుంచి 1000 లోపు మాత్రమే కోల్ మైన్స్ పెన్షన్ పొందుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కోసం కొందరు రోజు కూలీలుగా, హోటల్ కార్మికులుగా, అడ్డ కూలీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక చాలామంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, నూతన సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, గుర్తింపు కార్మిక సంఘాలు మానవతా దృక్పథంతో ఆలోచించి గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ ఉద్యోగులకు ఏరియా ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. అదేవిధంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు రెండు నెలలకు సరిపడా మందులు అందించాలని సింగరేణి యాజమాన్యం మరియు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్ళబండి రాజన్న,ప్రధాన కార్యదర్శి పుదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు భీమ్‌సేన్, కార్యదర్శి రాజేశం, నాయకులు భిక్షపతి, సదానందం, చారి, నారాయణ, అంజన్న, పోషం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



**ఖానాపూర్ మే 24 (ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలుస్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు మొదట కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం స్వీట్లు నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకొని సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ ,డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుర సత్యం,కౌన్సిలర్ నిమ్మల రమేశ్ ఆత్మ కమిటీ చైర్మెన్ తోట సత్యం,డీసీసీ అధికార ప్రతినిధి దయానంద్ కార్యదర్శి అంకం రాజేందర్ కార్యవర్గ సభ్యులు జన్నారపు శంకర్,నేరేళ్ల సత్యనారాయణ, ధ్యావతి రాజేశ్వర్ లాలూ నాయక్,కావాలి సంతోష్, శౌకత్ పాషా.మదిగేల గంగాధర్ డీలర్ రాజేందర్ ,దాసరి రాజన్న, శేషాద్రి, దాసరి రాజేశ్వర్ గుడిమందుల శ్రీహరి ములుగురి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలలో కలమడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ





**జన్నారం, మే 24 (ప్రజాజ్యోతి) :** శనివారం రోజు విడుదలైన టీజీ పాలిసెట్ 2026 ఫలితాల్లో జన్నారం మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాడి ఆంజనేయ ప్రసాద్ రాష్ట్రస్థాయిలో ఎంబైపిసిలో 28వ ర్యాంక్, ఎంపీసీలో 79 వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి తెలిపారు. అలాగే టిఎస్ఆర్‌జెసి ఫలితాల్లో అదే పాఠశాలకు చెందిన బోనగిరి రాజేష్ రాష్ట్రస్థాయిలో 22వ ర్యాంకు, జాడి ఆంజనేయ ప్రసాద్ 125 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా ఉన్నతమైన విద్య లభిస్తుందినడానికి నిదర్శనమని అన్నారు. జాతీయ ఉపకార వేతనాల్లో గాని, పోటీ పరీక్షలలో గాని, పదవ తరగతి పరీక్షల్లో ఫలితాల్లోగానీ మా పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్, ఎంఈఓ విజయ్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్ తదితరులు అభినందించారు.

## కొత్తకాపు లక్ష్మారెడ్డి కృసితో బొగ్గు గని పెన్షనర్లకు భారీ ఊరట

– ఎఫ్‌పీఎస్–1971 సభ్యులందరికీ కనీస పెన్షన్ వెయ్యి అమలు

– వితంతువులకు 24 నెలల ఎరియర్స్‌తో ప్రయోజనం


– సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బి.ఎం.ఎస్.) నాయకులు



**మంచిర్యాల, 24, మే (ప్రజా జ్యోతి) :** బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి నిరంతర కృషి ఫలితంగా బొగ్గు గని పెన్షనర్లకు భారీ ఊరట లభించిందని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బి.ఎం.ఎస్.) నాయకులు పులి రాజారెడ్డి, మంద రమాకాంత్ తెలిపారు. ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్--1971 (ఎఫ్‌పీఎస్--1971) కింద ఉన్న సభ్యులందరికీ కనీస పెన్షన్ వెయ్యి అమలు చేయడంతో పాటు, వితంతువులకు 24 నెలల ఎరియర్స్ చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. బొగ్గు గనులలో సేవలందించి పదవీ విరమణ పొందిన లేదా స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) తీసుకున్న కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు పెన్షన్ విషయంలో చాలా కాలంగా అన్యాయం ఎదుర్కొంటున్నారన్నారు. ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్--1971 కింద అనేక మంది పెన్షనర్లు కనీస పెన్షన్ వెయ్యి పొందుతున్నప్పటికీ, కొంతమంది వీఆర్‌ఎస్ ఉద్యోగులు మరియు వితంతు పెన్షనర్లకు మాత్రం ఈ కనీస పెన్షన్ వర్తించక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్య బొగ్గు గనుల పర్యటనల సందర్భంగా పెన్షనర్ల ద్వారా కొత్తకాపు లక్ష్మారెడ్డి దృష్టికి రావడంతో, ఆయన దీనిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారానికి కృషి చేశారని , గత సంవత్సరం నిర్వహించిన జాతీయ పెన్షనర్స్ సమావేశంలో ఈ సమస్యను ప్రతిపాదించి ఆమోదింపజేయడంతో పాటు, అనంతరం జరిగిన బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశాల్లో కూడా పదేపదే ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొత్తకాపు లక్ష్మారెడ్డి పట్టుదలతో చేసిన కృషి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జి.ఎస్.ఆర్ 370(ఈ), 15, మే 2026 ద్వారా ఎఫ్‌పీఎస్--1971 సభ్యులందరికీ కనీస పెన్షన్ 1,000 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు . ఈ నిర్ణయంతో బొగ్గు గనులలో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికుల వితంతువులు సహా అర్హులైన కుటుంబాలకు 8,మార్చి 2024 నుంచి కనీస పెన్షన్ వర్తించనుండగా, గత 24 నెలల బకాయిలు కూడా చెల్లించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వేలాది పెన్షనర్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగనుందన్నారు. వితంతు పెన్షన్‌దారులకు న్యాయం జరిగేలా అహర్నిశలు శ్రమించి ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన కొత్తకాపు లక్ష్మారెడ్డి గారికి సింగరేణి పెన్షనర్లు, వితంతు పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బి.ఎం.ఎస్. నాయకులు పులి రాజారెడ్డి (అడ్వైజర్), మంద రమాకాంత్ (ప్రధాన కార్యదర్శి) తెలిపారు.

## హసన్‌పర్తిలో ఘనంగా మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు






హసన్‌పర్తి, మే 24 (ప్రజాజ్యోతి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదినాన్ని ఆదివారం హసన్‌పర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని కిట్స్ కళాశాల కూడలిలో కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, సర్పంచుల వేదిక అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, ఏరుకొండ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి, 65వ విభాగ అధ్యక్షుడు అయ్యల రాంరెడ్డి, ఎల్లాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వేదునూరి సునీల్, పుల్ల రవీందర్, కిరణ్, చిర్ర విజయ్, బండ చంటిరెడ్డి, ఎర్ర ప్రకాశ్, బసబోయిన కుమార్‌స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, దామెరసాగర్, దామెర రాజేందర్, యువరాజ్, బత్తుల రాజేందర్, ఎంపీటీసీ మల్లేశం, చింత నవీన్, రాకేష్, నేదునూరి కిషన్, మేకల ఆనంద్, సంతోష్, సర్పంచ్ సురేందర్, ఆరెల్లి వెంకటస్వామి, మూల తిరుపతి, నోముల ప్రశాంత్, మట్టెడ చందు, నద్దునూరి పవన్, రాజ్‌కుమార్, నద్దునూరి సాయికుమార్, వినయ్, అఖిల్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ చీఫ్ జన్మదిన వేడుకలు

**జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**





హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 24, (ప్రజా జ్యోతి): టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 60వ జన్మదిన వేడుకలను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, బట్టి శ్రీనివాస్ రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేసిన మహేష్ కుమార్ గౌడ్ జీవితం కార్యకర్తలకు ఆదర్శమన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న వారి నాయకత్వాన్ని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ క్యాడర్ మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

## కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా అందజేయాలి

**- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్**




ఆత్మకూరు/అక్కంపేట, మే 24 (ప్రజాజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు కౌలు రైతులను అదుకొవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో గ్రామంలో కౌలు రైతుల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి ఎల్ఈసి కార్డులను మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు రైతు భరోసాను అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడి ఓదాలో అప్పటి ప్రభుత్వానికి కౌలు రైతులకు రైతు భరోసా నష్టపరిహారం చెల్లించాలని ఉత్తరం రాశాడని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతు భరోసా పంట నష్టపరిహారము వ్యవసాయ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి మూడేళ్ల పాలనలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టి సారించలేదని ఆరోపించారు. కౌలు రైతులను ప్రభుత్వము గుర్తించకపోవడంతో పంట నష్టపోయిన సమయంలో పంట నష్టపరిహారం అందక కౌలు రైతులు మరింత అప్పుల పాలవుతున్నారన్నారు. పంటను అమ్ముకోవడంలో ఎరువులు, విత్తనాలు సబ్సిడీలో పొందడంలో కౌలు రైతులు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం కోసము చర్యలు తీసుకోవాలని కోరారు. భరోసా తో పాటు సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, రాష్ట్ర నాయకులు సిలువేరు బిక్షపతి, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భానుడి భగభగలు.. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి..!!

వరంగల్, మే 24 (ప్రజాజ్యోతి): జిల్లాలో ఎండలు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉదయం నుంచే మండిపోతున్న ఎండతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి భగభగలతో పాటు ఉక్కపోత కూడా పెరగడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు తీవ్ర వేడిమిని తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల తాగునీటి సమస్య కూడా తీవ్రంగా మారింది. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పశువులకు నీరు దొరకని పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత కారణంగా మధ్యాహ్న సమయంలో ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తీసుకోవాలని, చిన్నపిల్లలు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇక విద్యుత్ వినియోగం పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. ప్రభుత్వం చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# వేం నరేందర్ రెడ్డికి అర్చక ఉద్యోగ జేఏసీ వినతి

- వేద ఆశీర్వచనంతో ఘన సత్కారం
- అర్చకుల సమస్యల పరిష్కారానికి ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలి
- వేం నరేందర్ రెడ్డికి అర్చక ఉద్యోగ జేఏసీ వినతి



హనుమకొండ, మే 24 (ప్రజా జ్యోతి) : హన్మకొండలోని డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారుడిగా, రాజ్యసభ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు. హనుమకొండ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వేం నరేందర్ రెడ్డికి వేద ఆశీర్వచనం చేసి పట్టు వస్త్రాలతో సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని అర్చక ఉద్యోగులు, ధూప దీప నైవేద్య అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో ఉన్న 16 వేల దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. 2007లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి అమలు చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత ఆ చట్టం అమలులో లేకపోయిందని తెలిపారు.

ధార్మికవేత్తలతో ధార్మిక పరిషత్ ఏర్పాటు చేస్తే దేవాలయాల్లో ఆగమానుసారంగా పూజలు నిర్వహించడం, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, దేవాలయ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని వేం నరేందర్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, యువజన నాయకుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి, తనుగుల రత్నాకర్, అనిల్ కుమార్, లంకా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మిల్లులపై నిఘా..ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ స్పెషల్ ఫోకస్..!

- సంగెంలో కలెక్టర్ సత్య శారద సుడిగాలి పర్యటన - ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగనివ్వద్దు
- ఎండలు మండుతున్నాయి..కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు మరవొద్దు
- సెంటర్ ఇంచార్జ్‌లపై కలెక్టర్ ఆగ్రహం..తాగునీరు,నీడ ఏర్పాట్లకు ఆదేశం







సంగెం, మే 24 (ప్రజాజ్యోతి) : మండలంలో ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా పర్యటించారు.మండలంలోని కాట్రపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి,కొనుగోలు ప్రక్రియ,ధాన్యం నిల్వలు మరియు తరలింపు ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం కాపులకనపర్తి గ్రామ పరిధిలోని శ్రీవాణి రైస్ మిల్లును సందర్శించి,మిల్లింగ్ కార్యకలాపాలను సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రతపై ప్రత్యేక నిఘా : ప్రస్తుతం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సెంటర్ ఇంచార్జ్‌లను ఆదేశించారు.ప్రతి కేంద్రంలోనూ తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచా లని, వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగపద్మజా,డీసీఓ నీరజ, డీఎస్ఓ కిష్టయ్య, డీఎంసీఎస్ సంధ్యారాణి, స్థానిక అధికారులు, సెంటర్ ఇంచార్జ్‌లు రైతులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 30 వరకు మహిళా సంక్షేమ వారోత్సవాలు

**- సెర్ప్- మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ జిల్లా ప్రతినిధి, మే 24 (ప్రజాజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 30 వరకు జిల్లాలో మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మే 22న నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమాల కొనసాగింపుగా ఈ వారాంత కార్యక్రమాలను సెర్ప్-మెప్మా, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ సంయుక్తంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

**మే 25 - ఐఎంఎస్ భవనాలు, పోషణ - అంగన్‌వాడీ కార్యక్రమాలు :** గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాల కోసం కొత్త ఐఎంఎస్ భవనాలు, వర్క్ షెడ్లు, నిల్వ గోదాములకు భూమిపూజలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవాలు, కొత్త భవనాలకు శంకుస్థాపనలు, పోషకాహార ప్రదర్శనలు, తక్కువ ఖర్చుతో పోషకాహార వంటల పోటీలు, గర్భిణులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించనున్నారు.

**మే 26 - ఆర్టీసీ బస్సులు, బాల్య వివాహాల నిరోధం :** మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల ప్రారంభ కార్యక్రమాలతో పాటు "బాల్య వివాహం - బతుకు ఆగం" కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టనున్నారు. గ్రామ స్థాయిలో బాల్య వివాహాలపై అవగాహన, హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098 ప్రచారం, ప్రమాద ప్రాంతాల గుర్తింపు చేపడతారు.

**మే 27 - సోలార్ ప్లాంట్లు, మహిళల భద్రతపై అవగాహన :** జిల్లా, మండల మహిళా సమాఖ్యలకు మంజూరైన సోలార్ ప్లాంట్ల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు. మహిళా శక్తి పురోగతిపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు పోష్ చట్టం అమలుపై అవగాహన కార్యక్రమాలు, కమిటీలకు శిక్షణలు చేపడతారు.

**మే 28 - సమీక్ష, తదుపరి కార్యక్రమాలకు సన్నాహాలు :** ఈ రోజున రాష్ట్ర స్థాయి కార్యక్రమం లేకపోవడంతో గత రోజుల కార్యక్రమాల ఫాలోఅప్, ఫీల్డ్ సిద్ధత, తదుపరి కార్యక్రమాల అమలుకు సన్నాహాలు చేపట్టాలని నిర్ణయించారు.

**మే 29 - రుణ మేళా, జీవనోపాధి కార్యక్రమాలు :** వివిధ జీవనోపాధి యూనిట్ల ప్రారంభం, రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ చేపడతారు. వృద్ధ మహిళల సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఆరోగ్యం, ఆర్థిక భద్రత, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారు.

**మే 30 - ఉల్లాస్ సత్కారాలు, అంగన్‌వాడీ నమోదు కార్యక్రమం :** "అమ్మకు అక్షరమాల (ఉల్లాస్)" అభ్యాసకుల సత్కారం, కిశోర బాలికల కోసం మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే "అమ్మ మాట - అంగన్‌వాడీ బాట" పేరుతో నమోదు కార్యక్రమం, యూనిఫాం పంపిణీ, విద్యారంభ ధ్రువపత్రాల అందజేత చేపడతారు.

**సమన్వయానికి ప్రత్యేక కమిటీల ఏర్పాటు :** వారాంత కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో పలు ఉప కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా ప్రధాన ప్రణాళిక అధికారి సమన్వయ బాధ్యతలు నిర్వర్తించనుండగా, సెర్ప్--మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖలు, సమాచార పౌరసంబంధాల శాఖ, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖలు సమిష్టిగా కార్యక్రమాలను అమలు చేయనున్నారన్నారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలను దిగ్విజయం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# జానపద గిరిజన పరిశోధనలను వెలుగులోకి తీసుకురావాలి

**తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ...**

హనుమకొండ మే 24 (ప్రజా జ్యోతి) : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో గత మూడు దశాబ్దాలుగా సేకరించిన పరిశోధనలను పుస్తక రూపంలో ముద్రించి వెలుగులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. నూతనంగా అకాడమీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య కూరపాటి వెంకటనారాయణ ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఆయన నివాసంలో జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డా.గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో పీఠం అధ్యాపకులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, ఇతర పోటీ పరీక్షల కోసం విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నాణ్యమైన పుస్తకాలను తెలంగాణ తెలుగు అకాడమీ ముద్రిస్తుందన్నారు. ఈ క్రమంలోనే వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే విలువైన సమాచారాన్ని జానపద, గిరిజన బహుముకాంశాల పేరిట సేకరించి పీఠంలో భద్రపరచడం గొప్ప విషయంగా అభివర్ణించారు. ఈ పరిశోధన సమాచారాన్ని పుస్తక రూపంలో ముద్రించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వరంగల్ లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందిస్తామన్నారు. అధ్యాపకులకు సులువుగా బోధించే విధంగా కరదీపికలను ముద్రిస్తామన్నారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటేందుకు మంచి పుస్తకాలను ప్రచురిస్తామ న్నారు. విద్య, విజ్ఞానం, వైద్య రంగాల్లో సాంకేతిక అంశాలతో విభిన్న పుస్తకాలను మంచి రచయితలతో రూపొందిస్తామని అన్నారు. ఈ కార్య క్రమంలో కేయూ దురవిద్య కేంద్రం ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, పీఠం అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డికి ఘన స్వాగతం



హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 24, (ప్రజా జ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘన సన్మాన వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేం నరేందర్ రెడ్డికి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు.

## ఎండల నేపథ్యంలో ప్రజలు అమృతంగా ఉండాలి

**సయ్యద్ షరీఫ్ హౌస్ బుజుర్గ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు**



ఆత్మకూరు, మే 24 (ప్రజాజ్యోతి) : ఎండల నేపథ్యంలో ప్రజలు అమృతంగా ఉండాలని హౌస్ బుజుర్గ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్ కోరారు. గ్రామంలో రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జాగ్రత్తలు పాటించాలని సయ్యద్ షరీఫ్ సూచించారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగు టోపీ లేదా రుమాలు ఉపయోగించాలని లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. తరచూ నీరు మజ్జిగ గ్లూకోజ్ నీరు లేదా ఓఆర్ఎస్ ద్రవణం సేవించాలని సూచించారు. మధ్యాహ్నం ఎండ సమయంలో అవసరం లేకుండా బయటకు తిరగకుండా ఉండాలని కోరారు. వడదెబ్బ లక్షణాలుగా తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, అధిక జ్వరం, మత్తు, పిల్స్ అకస్మాత్తుగా స్థితి కనిపిస్తే వెంటనే బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి ప్రథమ చికిత్స అందించాలని తెలిపారు. పరిస్థితి విషమిస్తూ సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తుగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన నాగుర్ల వెంకటేశ్వర్లు..





పరకాల మే 24 (ప్రజాజ్యోతి) : నడికూడ మాజీ సర్పంచ్ నారా గాని ఐలయ్య సతీమణి సుగుణ ఆరోగ్యంతో అకాల మరణం చెందగా వారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు.అదేవిదంగా నర్సక్కపల్లె గ్రామానికి చెందిన బండి రాజయ్య, గడ్డం సత్తయ్య అకాల మరణం చెందగా, వారి నివాసాలకు వెళ్లి పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.

**మండల సోషల్ మీడియా ఇన్చార్జికి పరామర్శ.. :** మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ నారగాని రాకేష్ ప్రమాదవశాత్తు బైక్ స్కిడ్ అయి పడగా, పలు గాయాలు కాగా వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. వారితోపాటు వరికెల కిషన్ రావు, నాగూర్ల సంతోష్, లోకాటి నగేష్, వాంకె రాజు,రాజయ్య, నర్సింగరావు, రాజు, కుమార్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డి సన్మాన సభ



హనుమకొండ జిల్లా ప్రతినిధి 24 (ప్రజాజ్యోతి) : హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వరంగల్ జిల్లా అభివృద్ధిలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు నిధులు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, మంత్రులు సీతక్క, కొండా సురేఖ తదితరులు వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల కష్టఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఓరుగల్లు అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, యంగ్ ఇండియా స్కూల్స్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.

## బిఎన్ తిమ్మాపురం గ్రామ ప్రజల నష్టపరిహారం కోసం తండ్రి తనయులు చేస్తున్న కృషి అభినందనీయం

**భువనగిరి,మే 24 (ప్రజాజ్యోతి) :** భువనగిరి మండలం బస్వపూర్ రిజర్వా యర్ లో తాము పుట్టిపెరిగిన ఊరు బిఎన్ తిమ్మాపురం గ్రామం ముంపునకు గురికావడం జీర్ణించుకోలేక, తమ గ్రామ ప్రజల బాగు కొరకు ఎంత దూరమైన, వెళి తన గ్రామ ప్రజల కొరకు న్యాయం చేయాలని ఆరాటపడుతూ పరితపిస్తున్న భువనగిరి మాజీ సింగిల్విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి మరియు వారి కుమారుడు బిఎన్ తిమ్మాపురం, సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి, తండ్రి కొడుకులు చేస్తున్న పోరాటం చాలా అభినంద నీయమని,బిఎన్ తిమ్మాపురం నిర్వాసితులు అన్నారు. గతంలో ఎడ్ల సత్తి రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రజా భవన్ లో కలిసి మా గ్రామ నిర్వాసితులకు న్యాయం చేయాలని స్వయంగా, కలిసి వివరించి వినతి పత్రం ఇచ్చారు.వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి,30 కోట్ల నష్ట పరిహారం విడుదల చేశారు. ఇప్పుడు వారి కుమారుడు ఎడ్ల వెంకట్ రెడ్డి కూడా తన తండ్రి అడుగు జాడల్లో పయనిస్తూ,తాను పుట్టిపెరిగిన, ఊరు బస్వపూర్ రిజర్వాయర్లో ముంపునకు గురవుతుందని తీవ్ర కలత చెంది,తమ గ్రామప్రజలకు ఏ విదంగానైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో గ్రామ ప్రజలందరి ఆమోద యోగ్యంతో,సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎడ్ల వెంకట్ రెడ్డి,స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి తిమ్మాపురం గ్రామ ప్రజలకు,రావాల్సిన మిగతా నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ని కలవడం అభినంద నీయమని,మా గ్రామ ప్రజల కోసం నిరంతరం తపనపడుతూ ప్రజలకు ఎలాంటి చిన్న ఆపద, సమస్యలు,వచ్చినా మమ్ము లను ఆదుకునే గుణం తండ్రి కొడుకులుఎడ్ల సత్తి రెడ్డి మరియు ఎడ్ల వెంకట్ రెడ్డి కు ఉండడం,మా గ్రామం కోసం పోరాడే,నాయకులు మా గ్రామంలో ఉండడం మా గ్రామం చేసుకున్న అదృష్ట మని గ్రామ ప్రజలు కొనియా డారు.వీలు చిక్కినప్పుడల్లా ఎప్పటిక ప్పుడు భువనగిరి ఎమ్మెల్యే,కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని,మరియు కలెక్టర్,మొదలుకొని ఉన్నత స్థాయి అధికారుల వరకు మా నిర్వాసితు ల కొరకు న్యాయం కోసం పోరాడి, సమస్యలు వినిపించే నాయకులు మా గ్రామ ప్రజల కొరకు గళం విప్పి మాట్లాడి పోరాటం,చేసి నాయకులు ఉండడం మా గ్రామ ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామని నిర్వాసి తులు తెలిపారు.

## వడదెబ్బతో వెంకటేష్ మృతి



**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన కామెడిగారి వెంకటేష్ (47 ) వడదెబ్బతో ఆదివారం మృతి చెందారు. మృత్యునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన వెంకటేష్, మృతితో ఆ కుటుంబం వీధిన పడ్డది అన్నారు. ప్రభుత్వం వెంటనే వారిని ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు.



## గ్రామస్థాయి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు ఏర్పాటు చేయాలి

**- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కందుల నర్సింగారావు**

**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** మాదిగల ఆరాధ్య దైవం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకలు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మే 25 నుండి 30 తేదీల వరకు నూతన గ్రామస్థాయి ఎమ్మార్పీఎస్ కమిటీలు ఏర్పాటు చేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కందుల నర్సింగరావు అన్నారు. ఆదివారం ఆలేరు పట్టణంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులకు ఉండవలసిన అర్హతలు విద్యావంతులై ఉండాలి, సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలి, మాదిగల హక్కులు అభివృద్ధిపై అవగాహన కలిగి వ్యక్తి అయ్ ఉండాలి ఉద్యమస్ఫూర్తి కమ్యూనికేషన్ స్కిల్స్ సమయపాలన అంకితభావం కలిగి ఉండాలి అన్నారు. గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేసి మాదిగల ఐక్యతకు హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## డిడి యాదగిరి ఛానల్ ఆట పాట సీజన్ -3 విజేతగా హేనా గ్రేస్



**నిడమానూరు, మే24(ప్రజాజ్యోతి) :** మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన పొట్టే పాక అంజయ్య కవిత ఉప సర్పంచ్ కుమార్తె హేనా గ్రేస్ ధురదర్శన్ (డిడి యాదగిరి)-ఛానల్ రామంతపూర్ లో ఆటపాట ప్రోగ్రాం నిర్వహించగా సీజన్-3లో సింగర్ హేనా గ్రేస్ విజేతగా నిలిచింది .ఈ సందర్భంగా ఆట పాట సీజన్ -3 విజేత సింగర్ హేనా గ్రేస్ మాట్లాడుతూ నా గెలుపు వెనకాల మా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని నా గెలుపు మా తల్లిదండ్రులకే అంకితం అని భావోద్వేగానికి లోనైయ్యారు.అనంతరం గోరేటి వెంకన్న చేతుల మీదుగా మొదటి బహుమతి అందజేశారు.

## ఆలేరు మున్సిపల్ కోఆప్షన్ ఇర్ఫాన్ ఇక్బాల్‌కి సన్మానం



**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుమున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ఎం ఏ. ఇంతియాజ్ ఇర్ఫాన్ఇక్బాల్ కి ఆత్మీయ సన్మానం ఆలేరు పురపాలక సంఘం కోఆప్షన్ సభ్యురాలు ఎంఏ ఇక్బాల్ ఇంతియాజ్ ఇర్ఫాన్ గారికి ఆదివారం రోజున ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్×చీఖజ యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ఘనంగా సన్మానించడం జరిగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రజెండా భుజాన వేసుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు గారి సతీమణి ఇంతియాజ్ ఇర్ఫాన్ గారికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ఆలేరు శాసనసభ్యులు బీర్ల. ఐలయ్య గారికి, సిపిఎం పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముున్ముందు ఇంకా అనేక కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

## క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత




**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ డీసీసీబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి గెలిచినా టీమ్స్‌కు బహుమతి అందజేయడం జరిగింది. ప్రథమ బహుమతి యాదగిరిగుట్ట ద్వితీయ బహుమతి కొలనుపాకగా గెలుపొందారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, సర్పంచ్ బేధారబోయిన యకమ్మ వెంకటేష్, టంగుటూరు సర్పంచ్ జుకంటి అనిల్, గ్రామశాఖ అధ్యక్షులు జంగా స్వామి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు మామిడాల భానుచంధర్ ,చాడ సురేందర్ రెడ్డి, గంధమల్ల రవి ,వర్గ శ్రీశైలం ,కుమ్మరిండ్ల ఆంజనేయులు, ఏదునూరి భాస్కర్ ,ఆర్గనైజర్స్ గంగుల నిఖిల్ ,మామిడాల భాను , సొంటెం ప్రవీణ్ ,హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గరాసి కుంటలో మట్టి మాయం చేస్తున్న రియాల్టర్లు?

**- అధికారుల కనుసన్నల్లోనే మట్టి తరలింపా -రైతుల పేరుతో గుల్ల అవుతున్న చెరువు కుంటలు**





**ఆత్మకూర్(ఎం), మే 24 ప్రజా జ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని బుగ్గరాసి కుంటలో చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రైతుల అవసరాల పేరుతో మట్టి తీసుకుంటున్నట్లు చూపిస్తూ,వాస్తవానికి కొంతమంది రియాల్టర్లు తమ వెంచర్లలో ఆ మట్టిని పోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్లు, హిటాచి జేసీబీల సహాయంతో చెరువు నుంచి మట్టి తరలింపు కొనసాగుతుండగా,సెలవు దినాల్లో కూడా ఈ వ్యవహారం నిరాటంకంగా సాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. భారీ స్థాయిలో మట్టి తరలింపుతో చెరువు ఆకృతి మారిపోతుండగా, భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత బహిరంగంగా మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ వ్యవహారం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈ పవన్‌ను సంప్రదించగా,చెరువు నుంచి మట్టి తరలింపుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని,వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం





**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ కాదూరి అచ్చయ్య రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రచ్చర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో బిజెపి పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు, గిట్టుబాటు ధర పెంచి ఇవ్వాలని బిజెపి పార్టీ ప్రభుత్వానికి ముందస్తుగా సూచన చేసినప్పటికీ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ విఫలమైందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 40 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు జరిగిందని, ఇంకా 60 శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన రైతు సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు, ఎంపీలు మరియు ఎమ్మెల్యేలతో కలిసి బస్సు యాత్ర నిర్వహించబడుతుందన్నారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి ఆలేరు నియోజకవర్గం ఇన్చార్జి చిరిగే శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడురామచంద్ర రావు గత నెల రోజుల క్రితం బోనగిరి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారని, అప్పటికే ప్రభుత్వానికి పలు సూచనలు చేశారని అమలు చేయలేదని విమర్శించారు. ఈ సమా వేశంలో బిజెపి పట్టణ, మండల అధ్యక్షులు నంద గంగేష్, పూజారి కుమారస్వామి, యాదగిరిగుట్ట టౌన్ ప్రెసిడెంట్ కర్రె ప్రవీణ్ కిసాన్ మోర్చా అధ్యక్షులు పూల హనుమంతు, జిల్లా కౌన్సిల్ నెంబర్ వడ్డేమాన్ నరేందర్, జిల్లా నాయకులు జంపాల శ్రీనివాస్ మండల కార్యదర్శి బైరి మహేందర్, బీజేవైఎం మండల కార్యదర్శి గిరి బోయిన పరుశరాములు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ డీవీకి ఘన సన్మానం!

- ‘డివి’ నియామకం శుభపరిణామం..
- వివిధ సంఘాల ప్రముఖుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సత్కారం.
- పురగిరి క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌కు వెల్లువెత్తిన అభినందనలు:
- శాలువాతో సత్కరించిన మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు



**కోదాడ రూరల్, మే 24 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర పురగిరి క్షత్రియ పెతిక కార్పొరేషన్ ప్రథమ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం చేత నూతనంగా నియమితుడైన దొంగరి వెంకటేశ్వర్లుకు వివిధ వర్గాల, సామాజిక సంఘాల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయనను పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు ఆధ్వర్యంలో పలు సంఘాల ముఖ్య నాయకులు చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లును కలిసి, శాలువా కప్పి, పూలమాలలు వేసి అత్యంత వైభవంగా సత్కరించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు మాట్లాడుతూ,అంకితభావం, నిరంతర శ్రమ, సేవాతత్పరత కలిగిన బలమైన నాయకుడు దొంగరి వెంకటేశ్వర్లును పురగిరి క్షత్రియ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా నియమించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం ద్వారా సమాజంలోని వెనుకబడిన, నిరుపేద వర్గాలకు అందే సంక్షేమ ఫలాలు మరింత వేగంగా చేరువవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఆయన నేతృత్వంలో కార్పొరేషన్ రాబోయే రోజుల్లో మరింత బలోపేతం అవుతుందని, పెతిక కులబాంధవుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ పదవి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న మట్టపల్లి అన్నదాన సత్రం అధ్యక్షుడు, కోకాపేట భవన నిర్మాణ కమిటీ సభ్యుడు తీపురిశెట్టి రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు, వాసవి భవన్ నిర్వాహకుడు చల్లా ప్రకాష్ రావు మాట్లాడుతూ, దొంగరి వెంకటేశ్వర్లుకు కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం అత్యంత శుభపరిణామన్నారు. నిరంతరం సమాజ సేవలో ముందుండే వారికి ఇలాంటి పదవులు దక్కడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు, మట్టపల్లి అన్నదాన సత్రం అధ్యక్షుడు తీపురిశెట్టి రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చల్లా ప్రకాష్ రావులతో పాటు కాచిరాజుగూడెం గ్రామ సర్పంచ్ కాచవరపు నరసింహారావు తదితర ప్రముఖులు పాల్గొని చైర్మన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామికి సన్మానోత్సవం



**ఆలేరు మే 24 ప్రజా జ్యోతి :** బందు సేవా మండలి ఆధ్వర్యంలో సుందరయ్య భవన్లో జరిగిన మహా సన్మానోత్సవములో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజీపేట గ్రామానికి చెందిన తెలంగాణ శ్రమ శక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామి ని మాదిగ మహా శక్తి అధ్యక్షులు మాజీ మంత్రివర్యులు మోత్ పల్లి నరసింహులు, తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్స్ చిలుక స్వామి ని అభినందిస్తూ మట్టిలో పుట్టిన మాణిక్యంలా మన జాతిలో చిలుక స్వామి గారు పుట్టడం చాలా గర్వించదగ్గ విషయమని మరియు ట్రాక్మెన్‌గా పనిచేస్తూ సౌత్ ఇండియాలోనే ఒక రైల్వే విభాగానికి కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్గా ఎన్నిక రావడం ఆయన యొక్క శ్రమకు నిదర్శనంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన శ్రమను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును ప్రధానం చేయడం యా వత్తు తెలంగాణ నాలుకోట్ల మందికి గర్వకారణమని అన్నారు. డాక్టర్ చిలుక స్వామిని ఎంతోమంది నాయకులు ప్రజలు ఆదర్శంగా తీసుకుని మీరందరూ చిలుక స్వామి లాగా మీ మీ పనులలో గొప్ప ప్రాధాన్యత చూపించి ముందుకెళ్లాలని చిలుక స్వామి చేసినటువంటి గొప్ప కార్యక్రమాలను మంచి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ అధికారి భరత భూషణ్, బీసీ గురుకుల కార్యదర్శి మల్లయ్య పట్టు ప్రొఫెసర్ ముత్తయ్య ప్రొఫెసర్ మల్లేశం జేబీ రాజు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు డాక్టర్ అలెగ్జాండర్, గొల్లపల్లి దయానంద్ గారు, హైకోర్టు జీపీ గడ్డం వీరు, తదితర రైల్వే ఉద్యోగస్తులు బంద్ సేవ మండల నాయకులు ప్రజలు పాల్గొని స్వామి ని అభినందించారు.

## అంబరాన్నంటిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**- పాఠశాల రోజులను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు!**

**- జ్ఞాపకాల పందిరి కింద ఒకటైన పాతతరం**

**- ఘనంగా ముగిసిన ఆత్మీయ సమ్మేళనం..**



**మర్రిగూడ, మే 24(ప్రజాజ్యోతి) :** కాలం ఎంత వేగంగా పరిగెత్తినా, జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా.. బాల్యపు జ్ఞాపకాలు, చదువుకున్న పాఠశాల రోజులు ఎప్పటికీ మరువలేనివని నిరూపించింది.మర్రిగూడ మండలంలోని శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం నాడు పాఠశాలలో జరిగిన 2009-10 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేలనం ఎంతో ఘనంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. దాదాపు పదహారేళ్ల తర్వాత సహచర విద్యార్థులు ఒకరినొకరు కలుసుకోవడంతో పాఠశాల ఆవరణమంతా కోలాహలంగా మారింది. ఉదయం 10 గంటలకే మొదలైన ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు ఈరోజు సమాజంలో వివిధ రంగాలల్లో స్థిరపడటం చూడటం ఎంతో గర్వంగా ఉందన్నారు.చదువుకునే రోజుల్లో క్లాస్ రూమ్‌లో కూర్చున్న సీట్లలోనే మళ్లీ కూర్చొని నాటి జ్ఞాపకాలను, చేసిన అల్లరిని అందరూ నెమరువేసుకున్నారు. చాలా కాలం తర్వాత కలుసుకోవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసిన అనంతరం, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆటపాటలతో సాగిన ఈ సమ్మేళనం, బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకోవడంతో ముగిసింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, రామకృష్ణ,ఆనంద్ ప్రసాద్, ప్రమోద్,నర్సింహా,శ్రీదేవి, స్వప్న, అన్నపూర్ణ, పూర్వ విద్యార్థులు కుక్కల వెంకటేష్, మెండే రమేష్, మంజుల, నాగరాజు, సుధాకర్, శంకర్,మహేందర్, సోని, రజిని, పరమేశ్వరి, రేవతి, సంతు తదితరులు పాల్గొన్నారు.

## పాలక వీడులో దర్జాగా అక్రమ ఇసుక దందా



**పాలకవీడు, మే 24 (ప్రజా జ్యోతి) :** సూర్య పేట జిల్లా పాలక వీడు మండలంలో అధికార పార్టీ అండ దండల తో ఇసుక దందా మూడు పూలు ఆరు కాయలు చందంగా నడుస్తుంది.మండలంలోని మూసి పరివాహక గ్రామలైన సింగారం, ఎల్లాపురం, సజ్జపురం గ్రామాల నుండి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రావణా కు తాశీల్దార్ ఆఫీస్ నుండి కానీ, పోలీస్ స్టేషన్ నుండి కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోజు వందల ఇసుక ట్రాక్టర్లు అక్రమ రావణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ప్రజలు అంటున్నారు. పోలీస్ స్టేషన్ ముందు నుండి పగలు, రాత్రి అని లేకుండా అతి వేగంతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్ల గురించి తెలియక పోవటం ఏమిటని మండల ప్రజలు అనుకొంటున్నారు. ఇసుక ట్రాక్టర్ల ఫోటోలు ఎవరైనా తీసిన, వెంటనే ఆ వ్యక్తి కి మండల అధికార పార్టీ ముఖ్య నాయకుడి నుండి ఫోన్ వస్తుందని ఆ ట్రాక్టర్లు మావే వాటి విషయం గురించి ఏమీ పట్టించుకోవద్దు అని అధికారులను హెచ్చరిస్తుంటారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రతి దందాలో ఆ నాయకుడు పాత్ర ఉన్నట్లుగా మండల ప్రజలు చర్చించు కొంటున్నారు.ఇదే అదునుగా ఇసుక మాఫియా జోరుగా నడుస్తుందని ప్రజలు అనుకుంటున్నారు. ఎదో ఒకరోజు ఇసుక ట్రాక్టర్ పట్టుకోగానే అధికార పార్టీ నాయకుల ఫోన్ చేసి ట్రాక్టర్లను వదిలేయాలని వత్తిడి చేస్తారని, కొన్ని ఫార్మాలిటీస్ తో నడుస్తాయని ట్రాక్టర్ డ్రైవర్లు అనుకొంటున్నారని మండల ప్రజలు అనుకొంటున్నారు. ఇకనైనా అధికారులు ద్రుష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు.

## "పర్యావరణాన్ని కాపాడుదాం: స్టీల్ ప్లేట్లు వాడుదాం"

– నందిపేట్‌లో స్టీల్ బ్యాంక్ ప్రారంభం

(ప్రజా జ్యోతి, నందిపేట్)

నందిపేట్ మండల కేంద్రంలో ఆదివారం అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్, గ్రామ సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం ఆధ్వర్యంలో గ్రామాన్ని ప్లాస్టిక్







రహిత గ్రామంగా తీర్చిదిద్దే దిశగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని అవగాహన కల్పించే ఉద్దేశంతో "స్టీల్ బ్యాంక్"ను ప్రారంభించారు. సుమారు ఐదు వేల స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో ఈ స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు తమ శుభకార్యాలకు వీటిని తీసుకెళ్లి వినియోగించిన అనంతరం తిరిగి అప్పగించే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందని, క్యాన్సర్ వంటి వ్యాధులకు కూడా కారణమవుతుందని అవగాహన కల్పించారు. ప్రజలు ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వస్తువులు వినియోగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రామచందర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ మజరుద్దీన్, మాజీ ఎంపీటీసీ అహ్మద్ ఖాన్, సీనియర్ నాయకులు గుండప్ప శంకర్, నసీర్, అక్బర్, తమ్మల దేవేందర్, దినేష్, ప్లాట్ల శ్రీనివాస్, చింత శ్రీనివాస్, కంటం చిన్నయ్య, ఆధ్వాల లక్ష్మి, నాగ మల్లయ్య మాజీ ఎంపీటీసీ, దేవత లింగం, గ్రామ ప్రజలు, యువకులు,ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితుడి చికిత్సకు ప్రభుత్వ భరోసా

నిజామాబాద్ రూరల్, ప్రజాజ్యోతి:

స్వగ్రామంలో కల్తీ కల్లు (గుల్ఫారం) సేవించే అలవాటు వలన దుబాయిలో మానసిక అస్థిరతకు గురైన డిచ్ పల్లి మండలం మెంట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన మొద్దు గంగాధర్ హైదరాబాద్ కు చేరిన తర్వాత మానసిక వైద్యం అందించడానికి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చొరవతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధర్ ను స్వదేశానికి తెప్పించాలని, వచ్చిన తర్వాత డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) చికిత్స అందించాలని కోరుతూ అతని భార్య సుప్రియ ఈనెల 12న హైదరాబాద్ బేగంపేట ప్రజాభవన్ లో 'సీఎం స్టేట్ లెవల్ ప్రవాసీ ప్రజావాణి' లో వినతిపత్రం సమర్పించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఈ మేరకు జీఏడీ ఎన్నారై సెల్ అధికారులకు లేఖ రాశారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 నిబంధనల ప్రకారం... మొద్దు గంగాధర్ ను హైదరాబాద్ లోని మానసిక ఆరోగ్య సంస్థలో చేర్చుకొని చికిత్స అందిస్తామని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ ఈ నెల 22న ఎన్ఓసీ జారీ చేశారు. "రోగి ఆసుపత్రిలో చేరిన సమయంలో కుటుంబ సభ్యులు లేదా బంధువులు అతనితో ఉండి బాధ్యత వహించేందుకు సిద్ధంగా ఉంటే, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 లోని సెక్షన్ 86 ప్రకారం ఫ్యామిలీ వార్డులో చేర్చవచ్చు. కుటుంబ సభ్యులు క్లోజ్డ్ వార్డులో చేర్పించాలని కోరిన పక్షంలో, అందుకు అవసరమైన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందాల్సి ఉంటుంది." అని ఆ ఉత్తర్వులో స్పష్టం చేశారు. కాగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రత్యేక చొరవ చూపడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## తెయూలో పీసీసీ చీఫ్ జన్మదిన వేడుక



నిజామాబాద్ రూరల్, ప్రజాజ్యోతి:

తెలంగాణ యూనివర్సిటీలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకను పరిశోధక విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ యూనివర్సిటీ అభివృద్ధికి, యూనివర్సిటీని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చే విధంగా కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంబఖ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కోటగిరి గ్రామంలో విఠలేశ్వర మందిరంలో
## అఖండ హరినామ సప్తసంతర్భంగా ప్రత్యేక పూజలు

కోటగిరి, మే 24, ప్రజా జ్యోతి.

కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర ఆలయంలో ఆలయంలో జ్యేష్ఠ అధికమాస సందర్భంగా నెలరోజుల పాటు అఖండ హరినామ సప్త నిర్వహణలో కార్యక్రమం లో ఆదివారం రోజు వడ్ల కళావతి రాములు, వడ్ల మీనా రాజు, సునీత భీమ్



వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పూజల నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వడ్ల రాముడు మాట్లాడుతూ శ్రీ పెట్టలేశ్వర్ ఆలయంలో మోహన్ సెట్ దాత రూపంలో టేకు కర్రలు ఇవ్వడం వల్ల గర్భగుడిలో విఠలేశ్వర పాండురంగని కూర్చోబెట్టడానికి మంచి డిజైన్ తో తయారు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సప్త సందర్భంగా రోజుకో కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం మహారాజుకి భజనలు కీర్తనలు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు 15 జూన్ రోజున సమాప్తి సందర్భంగా గ్రామంలో పల్లకి ఒరేయింపు నిర్వహిస్తామని ఈ కార్యక్రమం అనిరుద్ మహారాజ్ చే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కట్టు మోహన్ సెట్, నాగేష్ కట్టు, సంతోష్, కమ్మరి గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# నందిపేట్‌లో హృదయ విదారక ఘటన

– పుట్టిన వెంటనే ఆడ శిశువును పొదల్లో వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తులు

(ప్రజా జ్యోతి, నందిపేట్ )

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో ఆదివారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టిన ఓ ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులోని చెట్ల పొదల్లో వదిలేసి వెళ్లడం స్థానికులను కలచివేసింది. ఉదయం సమయంలో ఆ ప్రాంతం గుండా వెళ్తున్న ఓ యువకుడు శిశువు ఏడుపు వినిపించడంతో అనుమానం వచ్చి అక్కడికి వెళ్లి చూడగా, పొదల్లో పడి ఉన్న నవజాత పసిపాప కనిపించింది. దీంతో వెంటనే స్పందించిన యువకుడు పసిపాపను సమీపంలోని



ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. వైద్యులు శిశువుకు అత్యవసర చికిత్స అందించినప్పటికీ అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో పాప మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. పుట్టిన వెంటనే కన్నబిడ్డను ఇలా వదిలేసి వెళ్లడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శిశువును అక్కడ వదిలేసి వెళ్లిన వారు ఎవరు, ఏ పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## నందిపేట్ పాల్గుట్టలో ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరం

– భారీగా తరలివచ్చిన ప్రజలు

(ప్రజాజ్యోతి, నందిపేట్)

నందిపేట్ మండలం పాల్గుట్టలోని కేదారేశ్వర ఆశ్రమం వద్ద ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరానికి ఈ నెల కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పరిసర గ్రామాలతో పాటు ఇతర






ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి తరలివచ్చారు. ఉదయం నుంచే ఆశ్రమం వద్ద రోగులతో రద్దీ నెలకొంది. శిబిరంలో పాల్గొన్న వైద్యులు ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు, ముత్యబిందు వంటి వ్యాధులను గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, శస్త్రచికిత్స అవసరమైన రోగులను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఎంపికైన రోగులను నిర్వాహకులు ఉచితంగా హైదరాబాద్‌కు తరలించి, అక్కడ నిపుణులైన వైద్యులతో కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా శస్త్రచికిత్స అనంతరం అవసరమైన లెన్సులను కూడా పూర్తిగా ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. పేద మరియు వృద్ధులకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా మారిందని స్థానికులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు వెల్లడించారు.

## కమ్మర్‌పల్లిలో ఘనంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

కమ్మర్ పల్లి ( ప్రజాజ్యోతి ) మే - 24 :

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బి.మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా





నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరిపారు. అనంతరం అయన మాట్లాడుతూ మహేష్ అన్న క్రమశిక్షణకు, విశ్వసనీయతకు మారుపేరు అని కొనియాడారు. పార్టీ అధికారంలో లేని కష్టకాలంలో కూడా ఆయన కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపి, పార్టీ అధికారంలోకి రావడానికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన సూచనలతో ముందుకు వెళ్లి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని, అలాగే ప్రజా పాలనలో భాగమై తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య, మాజీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఉప్లూర్ గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్, ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మురళి, డీసీసీ నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, తక్కురి దేవేందర్, బోనగిరి లక్ష్మణ్, బద్దం తిరుపతి రెడ్డి, సుంకరి విజయ్, బుచ్చి మల్లయ్య, కమ్మర్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గణేష్ గౌడ్, సీనియర్ నాయకులు గంగారెడ్డి, నిమ్మ ప్రసాద్, వన్నెలా రాజేశ్వర్, శివసరం గణేష్, డాక్టర్ నరేష్, శైలేందర్, అజర్, సాధుల్లా, మొకిమ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## రోజుకు కనీసం 12 లారీల ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలి

– అదనపు కలెక్టర్ విక్టర్







కామారెడ్డి ప్రతినిధి మే 24. (ప్రజాజ్యోతి) ఆదివారం మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్, లచ్చాపేట గ్రామాలను. అదనపు కలెక్టర్ విక్టర్ సందర్శించారు. అనంతరం మాచారెడ్డి గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీపీసీ కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి (డీసీవో)తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తదుపరి భిక్కనూర్‌లోని సప్తగిరి పీబీఆర్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి మిల్లర్‌తో మాట్లాడి ఎలాంటి ఆలస్యం లేకుండా రోజుకు కనీసం 12 లారీల ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలు పెరగకుండా మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్శనలో సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## 5 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

- రానున్న రోజుల్లో అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా ముందస్తు ప్రణాళికతో కొనుగోలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




కామారెడ్డి ప్రతినిధి మే 24. (ప్రజాజ్యోతి)

జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక మహిళా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని సూచించారు .రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడంతో పాటు రూ.45 వేల కోట్లకు పైగా చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేల సారవంతత దెబ్బతింటుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ మరియు సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో



పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

**నేటి నుండి మహిళా సాధికారిత కార్యక్రమాలు ప్రారంభం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి మే 25 నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మహిళల భద్రతపై అవగాహన, పోషణ కార్యక్రమాలు, అంగన్‌వాడీ సేవల బలోపేతం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, బాల్య వివాహాల నివారణ, మహిళల ఆరోగ్య పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలు, మండలాలు, పట్టణ స్థాయిలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏసిఎల్బి ఎన్‌వీ గిరి ఇంచార్జి, పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిఎం శ్రీకాంత్, డిఆర్డిఓ దామోదర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డికి ఆహ్వానం

– పెద్దమ్మ ప్రథమ వార్షికోత్సవం



**మెదక్ (ప్రజాజ్యోతి ) మే 24:** మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలంలోని టీ మాందాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదివారం వారి నివాసం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి వార్షికోత్సవ ఆహ్వాన శుభపత్రికను అందజేసి మహోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట ఆర్ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు స్వామి, సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, టీ మాందాపూర్ సర్పంచ్ రాణి గణేష్, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, వార్డు సభ్యుడు దినేష్, రజిత, లాలు ముదిరాజ్ అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు మల్లేష్, కరుణాకర్, అశోక్, కృష్ణ, చంద్రయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు/ప్రజాజ్యోతి** విదేశీ పర్యటనను దిగ్విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ కి చేరుకున్న రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు గారిని ఆదివారం పటాన్ చెరు గూడెం మహిపాల్ రెడ్డి, మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల హరీష్ రావు కుమారుడు ఆర్చిష్మాన్ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తో పాటు సంగారెడ్డిఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తదితరులు ఉన్నారు.

## జూన్ 5న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలి

– జిల్లా నాయకులు ర్యాగట్ల చందు



**మిరుదొడ్డి, మే 24, (ప్రజాజ్యోతి):** సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా ఎవరి కులం ఎంతో వారికంత వాటా అనే నినాదంతో దీజ, రాజ, గా–జీూజ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 5న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా నాయకులు చందు కోరారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీజ, రాజ, గా–జీూజ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కులాల జనాభా లెక్కల ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ మైదానం (సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రాంగణం)లో ఈ బహిరంగ సభ జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా దీజ, రాజ, గా–జీూజ రాష్ట్ర చైర్మన్ విశారదన్ మహారాజ్ హాజరవుతారని తెలిపారు. బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీూజ నాయకులు నవీన్, రవి, శ్రవణ్, అరవింద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ మేరా దోస్త్

## 45 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



**చిన్నకోదూరు, మే24, (ప్రజాజ్యోతి):–** చిన్నకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980–81 లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్నకోడూర్ లోని టీచర్స్ భవన్ లో జరుపుకున్న సమ్మేళనంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, సుందరయ్య, యాదగిరిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాము చేసిన అల్లరి పనులను, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందపడ్డారు. 45 సంవత్సరాల తర్వాత మళ్లీ అందరూ కలుసుకోవడంతో తమ సాధకబాధకాలను ఒకరితో మరొకరు పంచుకున్నారు. కార్యక్రమంలో అజీజ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, చంద్రారెడ్డి, సలీం, శివశంకర్, కృష్ణమూర్తి, ఓషయ్య, కుంటయ్య, వెంకట్ రెడ్డి, మధుర, వకుళ, పద్మ, రాజేశ్వరి, సుకన్య, పుష్ప, సంజీవరెడ్డి, నందారెడ్డి, శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్య ప్రసాద వితరణ కోసం రూ.2 లక్షల విరాళం

**– శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయానికి ముంబాయి దంపతుల భక్తి కానుక**

**కొమురవెల్లి, మే 24 (ప్రజా జ్యోతి):–** శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంకు ముంబాయికి చెందిన మడుపతి మల్లేష్––కవిత దంపతులు తమ తల్లిదండ్రులు మడపతి గంగారాం, మడవతి భీమవ పేరుపై రూ. 2,00,232లను విరాళంగా అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య ప్రసాద వితరణ కార్యక్రమం కోసం ఈ విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ వర్గాలు దాత దంపతులకు స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసి సన్మానించారు. ఆలయ పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్ వారికి విరాళానికి సంబంధించిన రసీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ముఖ్య అర్చకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.




## అభివృద్ధిలో ఆదర్శంగా ఇంద్రేశం మున్సిపాలిటీ

**– ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**– వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**







**పటాన్ చెరు/ప్రజాజ్యోతి** నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీనీ అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, రామేశ్వరంబండ, ఐనోలు, ఇంద్రేశం, బచుగూడెం వార్డులలో 15 కోట్ల రూపాయల అంచనా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ఉదయం స్థానిక మున్సిపల్ పాలకవర్గం తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని 5 మున్సిపాలిటీలలో ప్రజలు నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలలో సీసీ రోడ్లు, యూజీడీలు, పార్కులు, రక్షిత మంచినీరు అందించడానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు.. పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కుశంగుల ప్రమీల, వైస్ చైర్మన్ పట్లోల్ల హరీష్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, కౌన్సిలర్ లు అంతిరెడ్డి, లావణ్య, పట్లోల లత రెడ్డి, పాశం ఊర్మిళ రెడ్డి, రమేష్, చిమల్దారి రమేష్, పట్లోల్ల అంజలి రెడ్డి, అంబిలి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సుమతి, సల్మాన్ ఖాన్, నసీమ బేగం, మాజీ ప్రజా ప్రతినిధులు శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ రెడ్డి, రామచందర్, నర్సింలు, జంగారెడ్డి, బండి శంకర్, అనిల్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణే అస్త్రం.. శారీరక దృఢత్వమే లక్ష్యం!

**▬ విజేత ఉన్నత పాఠశాలలో ఘనంగా ముగిసిన కిక్ బాక్సింగ్, కర్రసాము వేసవి శిక్షణ శిబిరం**

**▬ మార్షల్ ఆర్ట్స్ రక్షణ కవచాలు: పురపాలక సంఘ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్**








**నర్సాపూర్ మే 23 (ప్రజాజ్యోతి)** నేటి ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా విస్తరిస్తోందో.. దురదృష్టవశాత్తూ అదే స్థాయిలో విపరీత పోకడలు, సామాజిక దుర్ఘటనలు అంతే వేగంగా పెరుగుతున్నాయని నర్సాపూర్ పురపాలక సంఘ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్ పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట కాలంలో ప్రతి విద్యార్థి, ముఖ్యంగా బాలికలు కేవలం పుస్తకాల్లోని చదువులకే పరిమితం కాకుండా.. ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేలా ఆత్మరక్షణ విద్యలను రక్షణ కవచాలుగా మలచుకోవాలని వారు పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని విజేత ఉన్నత పాఠశాలలో 'మెదక్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్' ఆధ్వర్యంలో గత నెల రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన కిక్ బాక్సింగ్, కర్రసాము వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రాజు యాదవ్‌తో కలిసి హాజరైన పురపాలక సంఘ చైర్మన్, వైస్ చైర్మన్‌లు.. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు.

**కట్టుబడిన క్రమశిక్షణ.. అలరించిన సాహసాలు!**

మార్షల్ ఆర్ట్స్ అనేవి కేవలం శారీరక దృఢత్వానికి పరిమితం కావని, అవి విద్యార్థుల్లో ఏకాగ్రతను, అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని విశ్లేషించారు. వేసవి సెలవులను టెలివిజన్లు, మొబైల్ ఫోన్లతో కాలాన్ని వృథా చేయకుండా, మన ప్రాచీన సంస్కృతికి అద్దంపట్టే సాంప్రదాయ కర్రసాముతో పాటు ఆధునిక కిక్ బాక్సింగ్‌లలో విద్యార్థులు అద్భుత నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ధీటుగా ఎదుర్కొనే మనోధైర్యం ఈ విద్యల ద్వారా లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మెదక్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, సంయుక్త కార్యదర్శి శేఖర్ ల పర్యవేక్షణలో జరిగిన ఈ ముగింపు వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన కిక్ బాక్సింగ్ విన్యాసాలు, కర్రసాము ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్, అసోసియేషన్ కోశాధికారి సమీర్, సిద్దార్థ్, ఆజాం శిక్షకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కు ముందే ఎరువుల దందా? రైతులపై అదనపు భారం

- పాత స్టాక్‌కు కొత్త ధరలు.. కాంప్లెక్స్, డీఏపీపై అక్రమ వసూళ్ల ఆరోపణలు
- ఎరువులతో పాటు పురుగుమందులు, ఇతర బస్తాలు కొనాలంటూ ఒత్తిడి
- వ్యవసాయ శాఖ తనిఖీలు లేకపోవడంపై రైతుల ఆగ్రహం



**దౌల్తాబాద్, మే 24: ( ప్రజా జ్యోతి)** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే దౌల్తాబాద్ మండలంలో ఎరువుల విక్రయాలపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచిన నేపథ్యంలో, తమ వద్ద ఉన్న పాత స్టాక్‌ను కూడా కొత్త ధరల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని చోట్ల డీఏపీ ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని చెబుతున్నారు. రాబోయే ఖరీఫ్ సాగు కోసం రైతులు ఇప్పటికే భూమి దుక్కి పనులు ప్రారంభించగా, విత్తనాలతో పాటు కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఈ అవసరాన్ని అవకాశంగా మార్చుకుని కొందరు వ్యాపారులు ఎరువుల ధరలను తమ ఇష్టానుసారం పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు. రైతుల కథనం ప్రకారం, గతంలో రూ. 1400కు లభించిన 20–20–0–13 50 కిలోల కాంప్లెక్స్ ఎరువు బస్తాను ప్రస్తుతం రూ. 1500 నుంచి రూ. 1580 వరకు విక్రయిస్తున్నారు. అయితే వ్యాపారుల వద్ద ఉన్న స్టాక్ పాత ధరలకే కొనుగోలు చేసినదేనని, అయినప్పటికీ కొత్త ధరల పేరుతో అదనపు భారం మోపుతున్నారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా, ప్రభుత్వం డీఏపీ ధర పెంచలేదని రైతులు చెబుతున్నప్పటికీ, మార్కెట్లో కొరత ఉందనే కారణంతో రూ. 1350 పరిధిలో ఉండాల్సిన బస్తాను రూ. 1600 వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గరిష్ట విక్రయ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ఇక ఎరువుల కొనుగోలుకు వెళ్లిన రైతులకు అవసరం లేని పురుగుమందులు, ఇతర వ్యవసాయ సామగ్రిని కూడా తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ షరతులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే "ఎరువులే లేవు.. వెళ్లిపోండి" అంటూ కొందరు వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువుల లభ్యత, ధరల నియంత్రణ, సరైన సలహాలు అందించాల్సిన అధికారులు స్పందించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ముందు ఎరువుల విక్రయ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## వరి గడ్డి కాల్చవద్దు..భూమాతను కాపాడుదాం..


– బిఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



**తొగుట, మే 24 (ప్రజాజ్యోతి):** వరి గడ్డి కాల్చడం వల్ల భూమి సారం తగ్గిపోవడమే కాకుండా, పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని బిఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేట లో ఆదివారం వనం చెరువు కింది పొలాల్లో అగ్ని ప్రమాదం మూలంగా వరి గడ్డి తో పాటు పైపులు, వైర్లు తగలబడిపోయాయి. పచ్చని చెట్లు కాలిపోయి వరి పొలం తగలబడి పోయే అవకాశం ఉండటంతో తొగుట పోలీసులు సంతోష్, భాను లతో పాటు గజ్వేల్ అగ్ని మాపక సిబ్బంది, రైతులతో కలిసి రెండు గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పివేయడం జరిగిందన్నారు. వరి కొయ్యకాలు, గడ్డి అంటు పెట్టడం మూలంగా రైతన్నలు కష్టపడి పండించిన నేల సారాన్ని మనమే నాశనం చేసుకోవద్దని కోరారు. అలాగే పంటలకు ఉపయోగ పడే సూక్ష్మ జీవులను కోల్పోవడం జరుగుతుందన్నారు. వరి గడ్డిని కాల్చకుండా పశువుల మేతగా, సేంద్రియ ఎరువుల తయారీలో, ఇతర వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తే రైతులకు అదనపు లాభం చేకూరుతుందని తెలిపారు. గడ్డి దహనం వల్ల వెలువడే పొగ వల్ల చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రమాదకరమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, గ్రామం బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. అవగాహనతో వ్యవహరించి వరి గడ్డి దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. పర్యావరణ పరిరక్షణే భావితరాలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి అని తెలిపారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య





బి.నర్సిములు ఫైల్ ఫోటో

**కోటపల్లి మే 24(ప్రజా జ్యోతి) :** కోటపల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామానికి చెందిన బంటు పెద్ద నర్సిములు తండ్రి రామయ్య వయసు 72సంవత్సరాలు అనే వ్యక్తి తేది 16-05-2026 మధ్యాహ్నం నుండి కనబడుట లేదని అతని కోడలు బంటు మల్లమ్మ పిర్యాదు మేరకు 20-05-2026 నాడు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సమయంలో తేది 23-05-2026 రోజు ఎన్నారం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు అని సమాచారంతో అక్కడకు వెళ్లి శవాన్ని పంచనామా నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తేది 24-05-2026 పంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాము అని ఎస్సై శైలజ తెలిపారు.

## స్థలాలు పోయిన ఉద్యోగాలు వస్తాయన్న ధీమాతో వారి నిర్ణయానికి అడ్డు చెప్పలేదు



- ఏకో టౌన్షిప్ పేరుతో చెత్త దంపు యార్డు కోసం అప్పగిస్తే చూస్తూ ఊరుకోం
- బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్

**కొత్తూర్ మే 24 (ప్రజా జ్యోతి) :** స్థలాలు పోయిన ఉద్యోగాలు వస్తే పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని ధీమాతో వారి నిర్ణయానికి అడ్డు చెప్పలేదు అని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆ భూములను పరిశ్రమల స్థాపనకు కాకుండా ఏకో టౌన్షిప్ పేరుతో చెత్త దంపు యార్డు కోసం అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని సిద్ధాపూర్ గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాలైన ఏనుగుమడుగు తండా, కొడిచెర్ల తండా, ఎస్బి పల్లి, కొడిచర్ల, పెంజర్ల ఇనుముల్నర్వ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఏర్పాటు చేసిన సుమారు 330 ఎకరాల టీజీఐఐసీ స్థలాన్ని ఏకో టౌన్షిప్ కోసం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.

## ఎస్ఐఆర్"పై అవగాహన సదస్సు

- భారతీయ జనతా పార్టీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్నేని ఫణీంద్ర



**ఉప్పల్, మే 24, ప్రజాజ్యోతి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జిల్లా పార్టీ సూచన మేరకు సెన్సిటివ్ ఇంటెన్సీ రివిజన్ ఎస్ఐఆర్ పైన అవగాహన సదస్సు ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణింద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య వక్తలుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొరిగే కృష్ణ బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి పాల్గొని ఎస్ ఐ ఆర్ గురించి బిఎల్ఎ టు ల కు దిశా నిర్దేశం చేశారు, ఈకార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కార్యకర్తలు మోర్చా అధ్యక్షులు అందరూ పాల్గొనడం జరిగింది.

## ఆరోగ్య భద్రత... ఆరోగ్య భరోసానిచ్చేది సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ




**కుత్బుల్లాపూర్ మే 24(ప్రజా జ్యోతి) :** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా సూరారం డివిజన్ కు చెందిన కె.ఎస్.ఎస్ ప్రఫుల్లా కుమారి కేరాఫ్ కె.జయప్రకాశ్ రావు రూ.50,000/-(యాభై వేల రూపాయలు) మంజూరు కాగా... సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధికి చెందిన చిక్క శ్వేత తండ్రి చిక్క శ్రీనివాసులుకు రూ.1,50,000/- (ఒక లక్షా యాభై వేల రూపాయలు) మంజూరు కాగా. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండి. సిద్దిక్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మణ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వీకెండ్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్ మే 24(ప్రజా జ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్(కుత్బుల్లాపూర్ డివిజన్)పరిధి జీడి మెట్ల గ్రామం హనుమాన్ క్రికెట్స్ గ్రౌండ్స్‌లో పండు, సంతు, యూసఫ్ నిర్వహించిన వీకెండ్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొని యువత చదువుతో పాటు క్రీడలలో కూడ ఉత్సాహంగా పాల్గొనాలని కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి. ఈ కార్య క్రమంలో డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, చక్రి, అరవింద్, సతీష్, రాజు, సందీప్ గౌడ్, పాపయ్య, అంజయ్య, వీరేశం, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్య పడొద్దు అండగా ఉంటాం

- ధాన్యం తడిసిన కూడ కొంటాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎంఆర్
- ఏ ఒక్క రైతుకు ఇబ్బంది రానివ్వను
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**తాండూరు మే 24 ప్రజా జ్యోతి :** వరి ధాన్యం రైతులు ఎవరు కూడా అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. ఆదివారం రోజు వరి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ద్వారా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సంబంధిత అధికారులు, మిల్లర్లు రైతులతో సమన్వయం చేసుకొని కొనుగోలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరంలో రూ.45 వేల కోట్ల రూపాయలు వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు అందించడం జరిగిందన్నారు. ఇంకా వరి ధాన్యం మిగిలిపోయిన రైతులకుకూడ ఏమాత్రం ఆ ధైర్య పడొద్దన్నారు. వరి ధాన్యం కొనుగోలు పై మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని వివరించారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురిసినప్పటికీ వరి ధాన్యం కి ఎలాంటి డోకా లేదని గుర్తు చేశారు. రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# రైతులు అధైర్య పడవద్దు.. ప్రతి గింజ కొనుగోలు చేస్తాం




- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**యాలాల్, మే 24: ప్రజా జ్యోతి :** మండలంలోని జుంటుపల్లి, బెన్నూర్, యాలాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురువ మైపాల్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడి పరిస్థితులను అధికారులతో సమీక్షించారు. అనంతరం యాలాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండుతున్న ఎండలు హమాలీల కొరత కారణంగా వరి ధాన్యం కొనుగోళ్లలో కొంత జాప్యం జరుగుతోందని తెలిపారు. అయితే కొనుగోళ్లను వేగవంతం చేసి కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు రైతుల నుంచి మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.

ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మిల్లుల్లో దిగుమతులకు కొంత సమయం పడుతోందని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు రైతులు, మిల్లర్లతో సమన్వయం చేసుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతులకు రూ.45 వేల కోట్ల మేర లాభం చేకూరిందన్నారు. గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కొరత ఉన్నా వెంటనే సరఫరా చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, గోదాములను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. రైతుల ఖాతాల్లో 72 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై కూడా ఎమ్మెల్యే విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం కాకుండా మరింత అధికంగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చైతన్య నగర్‌కు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గ్రామ రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రైతుల పక్షాన పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రైతుల కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, యాలాల్ సహకార సంఘం చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురువ మైపాల్, యాలాల్ సర్పంచ్ శివయ్య, జుంటుపల్లి సర్పంచ్ వాణిశ్రీ రమేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంతు ముదిరాజ్, మాజీ జిల్లా కోఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు వద్దే..వద్దు

- డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత
- లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని లేవనెత్తుతాం.
- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశాల జైపాల్



**కొత్తూర్ మే 24 (ప్రజా జ్యోతి) :** సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి రాష్ట్రస్థాయికి తీసుకెళ్తామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశాల జైపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఇందుకోసం సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలో 340 ఎకరాల అసైన్ భూమి సేకరించి టీజీఐఐసీకి అప్పజెప్పిందని తెలిపారు. పరిశ్రమలు వస్తే తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని భావించిన స్థానిక రైతులు యువతకు ఇప్పుడు అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు స్థలం కేటాయించడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ కేటాయిస్తున్నారన్న వార్తతో స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో భూగర్భ జలాలు విషపూరితమవటం అవడంతో పాటు చర్మవ్యాధులు ఏర్పడతాయని ఇక్కడ స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత పొలాలు నాశనమై పశువులు ఆరోగ్యం దెబ్బతిని మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రాంత పరిసర గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉపాధి నిచ్చే పరిశ్రమలు కావాలని కాలుష్యం పంచే డంపింగ్ యార్డ్ మాకొద్దని ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేశాల జైపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# రామంతపూర్‌లో బిఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ సన్నహక సమావేశం





- మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ట నాగేశ్వరరావు

**ఉప్పల్, మే 24, ప్రజా జ్యోతి :**

రామంతాపూర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పూనం భవన్ లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయా లని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ గంధం జోష్ణ నాగేశ్వర్ రావు, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు , పసుల ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముత్యాల నర్సిములు, స్థానిక నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, యువ నాయకులు, మహిళా నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విష్ణు డిజిటల్స్ పదవ వార్షికోత్సవ వేడుకలు





- ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మే 24, ప్రజా జ్యోతి :** విష్ణు డిజిటల్స్ 10వ వార్షికోత్సవ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ఉప్పల్ భాగయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత పదేళ్లుగా డిజిటల్ ప్రింటింగ్ రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ విశ్వసనీయతను సంపాదించిన విష్ణు డిజిటల్స్ సంస్థ మరిన్ని విజయాలను సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత మక్తాల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ తమ ప్రయాణానికి సహకరించిన ప్రతి కస్టమర్, మిత్రులు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తూకంలో మోసం చేయొద్దు

మంబాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**పెద్దేముల్ మే 24 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తూకంలో మోసం చేయొద్దని కొనుగోలు కేంద్ర నిర్వాహకు లకు సూచించారు. అదేవిధంగా రైతులు దళారుల వద్దకు వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవద్దాన్నారు. ప్రభుత్వ కొనుగోలు చేసిన ప్రతి రైతుకు సకాలంలో డబ్బులు జమ అవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాకాలం నాటికి వంతెన నిర్మాణం పూర్తి కావాలి

- కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే
- పనుల నాణ్యతలో రాజీ పడొద్దు
- చిలుక వాగు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూరు మే 24 ప్రజాజ్యోతి :** వచ్చే వర్షాకాలం నాటికి చిలుక వాగు వంతెన నిర్మాణం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం రోజు స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ చైర్పర్సన్ గిరిజ రెడ్డి తో కలిసి చిలుక వాగు నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు పట్టణంలోని 13వ వార్డులో గల చిలుక వాగు బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయడంతో రాకపోకలకు ఆటంకం కలగదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, పలువురు, కౌన్సిలర్లు అధికారులు ఉన్నారు.

## చావనైన చస్తాం కానీ డంపింగ్ యార్డ్ రానియం

సంచలన వ్యాఖ్యలు చేసిన వైయం తాండ సర్పంచ్ గోవింద్ నాయక్



**కొత్తూర్ మే 24 (ప్రజా జ్యోతి) :** చావనైన చస్తాం కానీ సిద్దాపూర్ లో డంపింగ్ యార్డ్ రానీయమని వైయం తాండ సర్పంచ్ గోవింద్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆ భూములను పరిశ్రమల స్థాపనకు కాకుండా ఏకో టౌన్షిప్ పేరుతో చెత్త దంపు యార్డు కోసం అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని సిద్దాపూర్ గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాలైన ఏనుగుమడుగు తండా, కొడిచెర్ల తండా, ఎస్బి పల్లి, కొడిచర్ల, పెంజర్ల ఇనుముల్నర్వ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఏర్పాటు చేసిన సుమారు 340 ఎకరాల టీజీఐఐసీ స్థలాన్ని ఏకో టౌన్షిప్ కోసం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. మా ఊరి పొలిమేరల్లో డంపింగ్ యార్డ్ పెట్టి మా ప్రాణాలు తీస్తామంటే ఊరుకోం. డంపింగ్ యార్డే పెట్టాలనుకుంటే మా ప్రాణాలు పోయినా భూములు ఇచ్చే వాళ్లం కాదని సర్పంచ్ గోవింద్ నాయక్ హెచ్చరించారు.

## రక్తదానం...ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం

బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్ మే 24(ప్రజా జ్యోతి) :** జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్ ఎస్సీఎల్ సువేల సుకేతన్ విల్లాస్‌లో లయన్స్ క్లబ్ కొంపల్లి లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆపదలో ఉన్న వారికి, తలసేమియా బాధితులకు ఎంతగానో ఉపయోగపడే ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ కొంపల్లి లైఫ్ స్పేసెస్ బృందానికి నా అభినందనలు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి అభినందిస్తూ ఎమ్మెల్యే ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రావు, ఉప్పల రమేష్, విశ్వనాథ రాజు, నరేందర్ రెడ్డి, మధు, లయన్స్ క్లబ్ కొంపల్లి లైవ్ స్పేసెస్ సభ్యులు చిల్లా రాము, పసుపులేటి కృష్ణ మూర్తి, రాజేష్, విక్రమ్, హర హరరావు పాల్గొన్నారు.

## అర్వజ్ అలీని అభినందించిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి మే24(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సత్తుపల్లి విద్యార్థి మహమ్మద్ ఆర్వాజ్ అలీ120/120 మార్కులు తెచ్చుకుని స్టేట్ లోనే మొదట ర్యాంకులో నిలబడటంతో, ఆదివారం ఆయన ను స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం సత్తుపల్లి కి గర్వకారణం అని, మన సత్తుపల్లి ఘనత, ఖ్యాతి స్టేట్ మొత్తం అభినందించేలా గొప్ప విషయం అని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుని మంచిగా చదువుకొని స్థిరపడాలని అభినందించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమాన్ చిన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, ఫస్ట్ ప్లేట్ నాగేశ్వరరావు ఉపాధ్యాయులు ఉన్నారు.

## రామాలయంలో కిక్కిరిసిన భక్తులు

**భద్రాచలం టౌన్ , మే 24 ప్రజాజ్యోతి**



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఒక వైపు వేసవి ఉష్ణోగ్రత 42 నుంచి 45 డిగ్రీల మధ్య ఉన్నా రామ భక్తులు రామయ్య దర్శనం కోసం వేచి ఉన్నారు. శనివారం సాయంత్రంకే భక్తులు భద్రాచలం చేరుకోవడంతో దేవస్థానం సత్రాలు,





> మండుటెండని సైతం లెక్కచేయని భక్తులు
> ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన దేవస్థానం అధికారులు
> క్యూలైన్‌లో రామయ్య దర్శనం కోసం భక్తులు ఎదురుచూపులు
> వేసవి సెలవులతో భక్తుల రద్దీ

కాటేజీలతో పాటు ప్రయవేటు లాడ్జీలు, వసతి గృహాలు సైతం భక్తులతో నిండిపోయాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల రద్దీ విపరీతంగా ఉండటం, వేసవి వేడి కారణంగా రామాలయంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసి భక్తులకు నేరుగా స్వామి వారి దర్శనం, శీఘ్రదర్శనం కల్పించారు. రామయ్య దర్శనానికి కనీసం 3 నుంచి 4 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. అలాగే భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. వేసవి తాపాన్ని ఎదుర్కొనేందుకు క్యూలైన్ల వద్ద భారీ ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. మిథిలా ప్రాంగణం చుట్టూ యాత్రికుల బస్సులు, కార్లతో రామాలయం పరిసర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి.

### వైభవంగా భద్రాద్రి రామయ్య కళ్యాణం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత స్వామి వారిని మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు వేదాశీర్వచనం నిర్వహించారు. కళ్యాణం పూర్తయిన తర్వాత కళ్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు కల్యాణంలో పాల్గొన్న వారికి అందజేశారు. అదేవిధంగా ఆదివారం సందర్భంగా అంతరాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.

### గిరిజన దర్బార్‌కు
## అధికారులు సకాలంలో హాజరు కావాలి


**భద్రాచలం టౌన్ , మే 24 ప్రజాజ్యోతి**



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగే గిరిజన దర్బార్‌కు అధికారులంతా సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ తెలిపారు. అలాగే గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటల వరకు అధికారుల సమావేశ మందిరంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

## నేతాజీలో అధునాతన వైద్య విప్లవం

- సబ్‌వ్యాస్టస్ పద్ధతిలో మోకాళ్ల కీళ్ల మార్పిడి
- భద్రాచలంలో ఏజెన్సీలో తొలి కేసు విజయవంతం
- దూర, ఆర్థికభారం తగ్గిందంటూ రోగి బంధువులు వేడుకోలు





**భద్రాచలం, మే 24, ప్రజా జ్యోతి:** ఆధునిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా నేతాజీ హాస్పిటల్ మరో కీలక అడుగు వేసింది. అత్యాధునిక సబ్‌వ్యాస్టస్ పద్ధతిలో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో తొలి కేసుగా గుర్తింపు పొందింది. వరంగల్‌కు చెందిన కృష్ణకుమారీ మోకాళ్ల కీళ్ల అరుగుదలతో గత కొద్దేండ్లుగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. హైద్రాబాద్, విజయవాడ తదితర పట్టణాలోన్ని కార్పోరేట్ హాస్పటల్స్‌కు వెళ్లినా పూర్తి మోకాళ్ల కీళ్ల మార్పిడికి అధిక ఫీజును చెప్పారు. దీంతో భద్రాచలంలో ఉండే తన కూతురు ద్వారా నేతాజీ హాస్పటల్‌లో వైద్యం అందిస్తున్న తీరును తెలుసుకొని, భద్రాచలంలో సర్జరీ చేయించుకున్నారు. హాస్పటల్ వైద్య బృందం సర్జరీను విజయవంతంగా పూర్తి చేసి, ఆమెను త్వరగా కోలుకొని నడిచే విధంగా చేయటంతో ఆమె హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక విధానంలో సంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే కండరాలపై తక్కువ ప్రభావం ఉండటంతో రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం నొప్పి తక్కువగా ఉండడం, త్వరితగతిన నడవగలగడం, కోలుకునే సమయం తగ్గడం వంటి ప్రయోజనాలు ఈ విధానంలో ఉన్నాయని పేర్కొన్నారు. నేతాజీ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. హేమంత్ కాకర్ల మాట్లాడుతూ... ఇటువంటి చికిత్స పద్ధతిలో భద్రాచలం ఏజెన్సీలోనే కేసును పూర్తి చేయటం ఇదే తొలిసారని పేర్కొన్నారు. "సబ్‌వ్యాస్టస్ పద్ధతి ద్వారా మోకాళ్ల కీళ్ల మార్పిడి చేసినప్పుడు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. తక్కువ నొప్పి, వేగంగా నడక ప్రారంభించడం వంటి ప్రయోజనాలు ఉంటాయి' అని పేర్కొన్నారు. హాస్పటల్ మేనేజ్‌మెంట్ జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఇలాంటి ఆధునిక చికిత్సల కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు భద్రాచలంలోనే అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని రోగి కుటుంబ సభ్యులు తెలిపారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చులు, ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని వారు పేర్కొన్నారు. హైద్రాబాద్‌లో అయ్యే ఖర్చులో సగం ఫీజుకే భద్రాచలంలో పూర్తి కావడంతో ఎంతో సంతోషంగా ఉందని రోగి బంధువులు రాఘవ పేర్కొన్నారు.

# సుడా, జిల్లా గ్రంథాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- కార్యకర్తల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదు
- సంక్షేమ పథకాలను గ్రామ, గ్రామానికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు
- జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం అమలు
- మహిళల ఆర్థిక బలోపేతానికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం కొనసాగింపు
- ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సుడా, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌లకు నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

కష్టకాలంలో సైతం అండగా నిలిచిన కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబాలకు ఆదివారం నిర్వహించిన అభినందన సభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్ట రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిడిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలినాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు చూపుతున్న ఆనందం పార్టీపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. దేశ స్వాతంత్ర్య సమరానికి ముందే గ్రంథాలయ ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట,జనగాం ప్రాంతాలు ఆ ఉద్యమాలకు కేంద్ర బిందువులుగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజలపై అత్యంత ప్రభావం చూపే సంస్థ గ్రంథాలయమని, అలాంటి సంస్థకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహమ్మద్ ఖాదర్ బాబాకు అభినందనలు తెలిపారు. సుడా,జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని సూచించిన ఆయన, ప్రజలకు సేవలు అందించేందుకు అవసరమైన సహకారం స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పనిసరిగా అందిస్తారని అన్నారు. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ నిర్లక్ష్యం చేయదని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజల అభివృద్ధి కోసం సాధించుకున్నామని, గత పాలకులు ప్రజల అవసరాలను పక్కనపెట్టి రాష్ట్రాన్ని కుటుంబ ప్రయోజనాల కోసం వినియోగించారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల కోసం పోరాటం చేశారని, ఆ పోరాటం చేసిన ఒక్క కార్యకర్తను కూడా మర్చిపోమని అన్నారు. యువజన విభాగం, మహిళా కమిటీలు, మండల నాయకుల సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో 55 రూపాయలు ఉన్న సన్న బియ్యాన్ని కోటి ఆరు లక్షల కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడత ఇండ్ల మంజూరుకు మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. 53 లక్షల నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నా మని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మహిళలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి 550 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. పేద,బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాల్లో బ్రేక్ ఫాస్ట్, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టబోతున్నా మని తెలిపారు. జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నామని, 5 లక్షల బీమా సహాయం రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు. గ్రామ గ్రామానికి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు అందిస్తామని, కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన నాయకులకు నేడు సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు రావడం సంతోషకరమని అన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే రాష్ట్ర నాయకత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని చెప్పారు. పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కు పదవి రావడం తనకు వ్యక్తిగతంగా ఆనందంగా ఉందని, ఖమ్మం నగరంతో పాటు పరిసర మండలాల అభివృద్ధికి సుడా ద్వారా మరిన్ని నిధులు తీసుకురావాలని సూచించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రి, ఖమ్మం ఎంపీ,సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- యాసంగి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కు అభినందనలు
- సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయి
- గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు
- మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి పాల్గొన్న డిప్యూటీ సిఎం






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,పౌర సరఫరాల శాఖ కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా కొనుగోలు నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, అధికారులు సమర్థవంతంగా పనిచేశారని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 1,23,560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, అందులో 1,12,922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందని, మరో 16 వేల టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధి లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం కూడా వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో పంట అవశేషాలను కాల్చకుండా టామ్‌టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని మంత్రి పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని,వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ ఆద్వర్యంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

**భద్రాచలం టౌన్ , మే 24 ప్రజాజ్యోతి**

భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపు ఆదివారం ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరంను భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, హెచ్‌సీఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణతో వారు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడమే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో కోచ్‌లుగా కుప్పాల చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్ శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.





# వేం నరేందర్ రెడ్డి సన్మాన సభ

హనుమకొండ జిల్లా ప్రతినిధి 24 (ప్రజాజ్యోతి)

హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు



మాట్లాడుతూ వరంగల్ జిల్లా అభివృద్ధిలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు నిధులు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, మంత్రులు సీతక్క, కొండా సురేఖ తదితరులు వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల కష్టఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఓరుగల్లు అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, యంగ్ ఇండియా స్కూల్స్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.

# మేడిగడ్డ వద్ద ఎల్ అండ్ టీలో భారీ అగ్నిప్రమాదం..

## ప్రమాదంలో కీలక పత్రాలు బూడిద!

జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బ్యారేజ్ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కార్యాలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు ఆఫీస్ అంతటా వ్యాపించడంతో ఆ ప్రాంతాన్ని దట్టమైన పొగలు కమ్మేశాయి. ఈ ప్రమాదంలో మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి, దానికి సంబంధించిన నిర్వహణ పనులకు చెందిన పలు కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లు పూర్తిగా కాలి బూడిదైనట్లు ప్రాథమిక సమాచారం. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్ల కుంగుబాటు వ్యవహారంపై ఇప్పటికే వివాదం నడుస్తున్న తరుణంలో, దానికి సంబంధించిన రికార్డులు ఉన్న కార్యాలయంలోనే ఈ ప్రమాదం జరగడం తీవ్ర కలకలం రేపుతోంది.

ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదం కేవలం ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు, ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు, అవకతవకలపై ఆరోపణలు, కోర్టు కేసులు, పునరుద్ధరణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయంటూ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను ప్రశ్నించి పలు వివరాలు సేకరించి ఘోష్ కమిషన్ నివేదిక అందించింది. ఈ నివేదికపై ఇటీవల తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని కోర్టు పేర్కొన్నప్పటికీ, సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన, సరైన నోటీసులు ఇవ్వని కారణంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు వ్యతిరేకంగా కమిషన్ ఇచ్చిన కొన్ని అంశాలను కోర్టు పక్కన పెట్టింది. అయితే, దీనిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని, కేవలం సాంకేతిక, విధానపరమైన లోపాల వల్లే వారికి తాత్కాలిక ఉపశమనం లభించిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరిందని, హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకి కాదని ప్రభుత్వం తెలిపింది.

# ప్రమాదంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్

## నీట్ పేపర్ లీక్‌పై రాహుల్ గాంధీ విమర్శలు

నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పేర్కొన్నారు. అందుకే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు.

తెలంగాణలోని హైదరాబాద్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో జరిగిన నిరసన వీడియోను జతచేస్తూ రాహుల్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో రాహుల్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు హైదరాబాద్‌లో పాదయాత్ర నిర్వహించారు. యువజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ఊరుకునేది లేదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సమస్యపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ షేర్ చేసిన వీడియోనే రీషేర్ చేసింది. నీట్ పేపర్ లీక్ అనేది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను చీకట్లోకి నెట్టేసిందని పేర్కొంది. నీట్ పేపర్ లీక్ సమస్యపై ఎన్ఎస్‌యూఐ తనదైన రీతిలో స్పందించింది. నీట్-యూజీ 2026 పేపర్ లీక్ అనేది '22 లక్షల మంది విద్యార్థుల కలలపై జరిగిన దాడి' అని అభివర్ణించింది.

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు..

మొదటిపేజీ తరువాయి..

న్యూఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు 102 రూపాయల 12 పైసలకు చేరుకుంది, డీజిల్ ధర లీటరుకు 95 రూపాయల 20 పైసలకు చేరుకుంది. హైదరాబాద్‌లో రూ.288 చొప్పున పెరగడంతో పెట్రోల్ లీటర్ ధర రూ.115.73 కాగా, డీజిల్ ధర సైతం రూ. 103.82కు ఎగబాకింది. కేవలం సాధారణ పెట్రోల్, డీజిల్ మాత్రమే కాకుండా, ప్రీమియం ఇంధనాల ధరలు కూడా పెరిగాయి. లీటరుకు 106.63 రూపాయలుగా ఉన్న ఎక్స్‌పి95 (శూ95) ధర మే 25న రూ. 109.24 కు చేరింది. ఎక్స్‌జి (శ+) ధర లీటరుకు 97.81 నుండి పెరిగి రూ. 100.52 కు చేరుకుంది. భారత్‌లో గతంలో ఎన్నడూ లేనట్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు గత 10 రోజుల్లో నాల్గవ సారి పెంచారు. ఈ నెలలో మొదట మే 15న దాదాపు 3 రూపాయలు పెంచారు. ఆ తర్వాత మే 19న సుమారు 90 పైసలు, మే 23న మళ్లీ 90 పైసలు, తాజాగా మే 25న మరోసారి ఇంధన ధరలు భారీగా పెంచి వాహనదారులకు మరోసారి షాకిచ్చారు. పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా మధ్య కొనసాగులున్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు (క్రూడ్ ఆయిల్) ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే, భారత ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు గత 4 ఏళ్లుగా రిటైల్ ధరలను పెంచకపోవడంతో, అవి ప్రతిరోజూ దాదాపు రూ. 1000 కోట్ల మేర నష్టాన్ని చవిచూస్తున్నాయి. మరోవైపు దిగుమతికి ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ తీవ్ర నష్టాల నుండి గట్టెక్కేందుకు కంపెనీలు



ప్రస్తుతం ఇంధన ధరలను క్రమంగా పెంచుతున్నాయి. అయినప్పటికీ, అంతర్జాతీయ సంక్షోభాన్ని భారత్ సమర్థవంతంగానే తట్టుకుందని నిపుణులు చెబుతున్నారు. గత రెండు నెలల్లో పలు విదేశాల్లో ఇంధన ధరలు 50 నుండి 100 శాతం మేర పెరగడం గమనార్హం.

# రాష్ట్రంలో కొనసాగుతున్న ఎండల తీవ్రత

**అధిక ఉష్ణోగ్రతలతో ఉడుకుతున్న తెలంగాణ**

**ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న వేడిగాలులు**

**ఏపీలో 48.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు**

**తెలంగాణలో 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత!**

**వడదెబ్బతో ఒక్కరోజే 76 మంది మృతి..**

**జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు**

అధిక ఉష్ణోగ్రతలకు తెలంగాణ ఉడికిపోతోంది. పగలూ రాత్రి అనే తేడా లేకుండా వేడిగాలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వాయువ్యదిశ గాలులు వీయడంతో తేమ శాతం తగ్గి ఉక్కపోత



ఎక్కువగా ఉంటోందని హైదరాబాద్ వాతావరణ శాఖ చెబుతోంది. మరి కొన్నిరోజులు పాటు రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రజలు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు అధికారులు. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నట్లుగా ఉష్ణోగ్రతలు నమోదువుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఆదివారం నాడు ఏపీలో 18 మంది, తెలంగాణలో ఏకంగా 58 మంది మృతిచెందం విషాదాన్ని నింపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో ఏకంగా 48.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీనితో పాటు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, పశ్చిమగోదావరి జిల్లా తణుకుల్లో 48.1 డిగ్రీలు, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంలో 47.3 డిగ్రీలు, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం 17 జిల్లాల్లోని దాదాపు 174 మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటేశాయి. ద్రోణి ప్రభావంతో ప్రకాశం, మార్కాపురం, కర్నూలు, నంద్యాల, అనంతపురం,చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలోనూ ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. రాష్ట్రంలోనే అత్యధికంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కుంచవెల్లిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్‌లో 46.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం తీవ్రంగా ఉంది. వడదెబ్బతో అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20 మంది చనిపోగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 16 మంది, ఖమ్మం జిల్లాలో 11 మంది, నల్గొండలో 5 మంది, ఆదిలాబాద్‌లో నలుగురు వ్యక్తులు, సిద్దిపేట జిల్లాలో ఇద్దరు మృతిచెందారు. రెండు రాష్ట్రాల్లోనూ రాబోయే మరో మూడు రోజుల పాటు ఎండలు, వడగాల్పుల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. తీవ్రమైన వడగాల్పుల దృష్ట్యా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు, తగినన్ని నీళ్లు తీసుకోవాలని అధికారులు ప్రజలను కోరారు. వేసవి కాలంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వరుస అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల గీతా కార్మికులకు జీవనాధారమైన ఈత, తాటి వనాలు పూర్తిగా దగ్ధమవుతున్నాయని, కాబట్టి గౌడ సోదరులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొలనూరు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాల వల్ల ఈత వనాలు పూర్తిగా కాలిపోయి, ఆయా గౌడ కుటుంబాలకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని మంత్రి గుర్తు చేశారు. ఈత, తాటి చెట్లను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వాటి సంరక్షణ ద్వారానే గౌడ కుటుంబాల జీవనోపాధిని రక్షించగలమని స్పష్టం చేశారు. ఇలాంటి అగ్నిప్రమాదాలను నివారించేందుకు గీతా కార్మికులు గ్రామ స్థాయిలో కలిసికట్టుగా చెట్ల సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈత, తాటి చెట్ల కింద పేరుకుపోయిన ఎండిపోయిన ఆకులు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెట్లకు నీరు పట్టడం వంటి ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. వీటితో పాటు ఈ వనాల సమీపంలో ఎవరూ బీడీలు, సిగరెట్లు కాల్చకుండా జాగ్రత్తలు పాటించాలని, నిర్లక్ష్యంగా నిప్పు వేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గీతా కార్మికులలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని తాను ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# ఉచిత విద్యుత్తును రద్దుచేయాలని కుట్ర

**ప్రీ పెయిడ్ సంస్థలను బడాబాబులకు అప్పగించే ప్లాన్**

**కాంగ్రెస్ చేస్తోన్న కుట్రలపై ప్రజలు తిరగబడాలి**

**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శ**

రాష్ట్రంలో ప్రీ పెయిడ్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును రద్దు చేసి అదానీ, అం బానీ వంటి ప్రీ పెయిడ్ సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు కాక ముందే కాంగ్రెస్ ఫ్యూజ్‌లు పీకేయాలి, అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 'నా బూతు.. నా భవిష్యత్తు' పేరిట అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్(సీఎం) కాదు... కటింగ్ మాస్టర్ (సీఎం) అని కేటీఆర్ దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో నిర్మాణం చేపట్టి పూర్తయిన వంతెనలు, భవనాలకు జేబులో కత్తెర పెట్టుకొని ప్రారరంభిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న కరెంటు మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, మంత్రివర్గంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ మీటర్లు వస్తే.. మొబైల్ ఫోన్ల తరహాలో ముందే రీ చార్జ్ చేసుకొని.. బ్యాలెన్స్ మేరకు విద్యుత్ వినియోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో కాంగ్రెస్ చేస్తోన్న కుట్రలపై ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మోదీ ఎంత ఒత్తిడి చేసినా.. రూ.30 వేల కోట్ల రుణం రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా.. కేసీఆర్ ఎదురించారే తప్ప.. మీటర్లు పెట్టేందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అర్హుల ఓట్లు జాబితా నుంచి తొలగించకుండా జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ వాళ్లు కొందరి ఓట్లు తొలగించే కుట్ర చేస్తారని, వారితో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. డిసెంబరు లేదా జనవరిలో కార్పొరేషన్ల ఎన్నికలు ఉండే అవకాశముందన్నారు. ఎమ్మెల్యేలు, పెద్ద నాయకుల చుట్టూ తిరగకుండా ప్రజల్లో ఉండి.. వారి సమస్యలపై పోరాడిన, సభ్యత్వ నమోదులో కీలకంగా వ్యవహరించిన వారికి సర్వేల ఆధారంగా పార్టీ టికెట్ ఇస్తామని కేటీఆర్ చెప్పారు. రైతుల ప్రయోజనాల కోసం మోదీని ఎదిరించిన ఘనత కేసీఆర్‌ది అయితే..



అధికారంలోకి రాగానే వచ్చే మూడు నెలల్లోనే ఇండ్లు, వ్యవసాయ రంగానికి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని శనివారం క్యాబినెట్‌లో కాంగ్రెస్ నిర్ణయించడం దారుణమని మండిపడ్డారు. మొబైల్ రీఛార్జ్ తరహాలో కరెంట్ మీటర్లు పెట్టి, పేదలు, రైతుల పొట్టగొట్టే ఈ కరెంటు కుట్రలపై ప్రజలు తిరుగబడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ధాన్యం, వడ్లు, మకలు కొనుగోలు చేయకపోవడంతో ఎకడికకడ రైతులు రోడ్లపైనే ఆరబోసుకుని కూర్చున్నారని తెలిపారు. ఒకవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపైనే రైతులు గుండెలాగి చనిపోతున్నారని, మరోవైపు వడదెబ్బకు అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేకుండా వ్యవహరిస్తున్నది. ఇవాళ రైతుల కండ్లల్లోంచి కన్నీరు కాదు, నెత్తురు కారుతున్నది' అంటూ సాగునీరు, సాయం అందక రైతాంగం పడుతున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ పేర్కొన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఐదు సంవత్సరాల కాలంలో సగం పూర్తయినా ఇప్పటిదాకా ప్రజలకు గాని, రాష్ట్రానికి గాని కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేక చేతులెత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, పరిపాలనా వైఫల్యాలు, అవినీతిపై ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, కచ్చితంగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని కేటీఆర్ తెలిపారు. ఉన్న నగరాన్నే పట్టించుకొనే దిక్కు లేదు కానీ, ఫ్యూచర్‌సిటీ అంటూ అడ్డగోలు మాటలు చెప్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రస్తుత హైదరాబాద్ నగరంలో కనీసం మోరీ తీసి చెత్త ఎత్తే పరిస్థితిలో కూడా లేని మున్సిపల్ శాఖ మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి, ఫ్యూచర్‌సిటీ అంటే ఎవరూ నమ్మరని విమర్శించారు. ఫ్యూచర్ లేని ముఖ్యమంత్రి ఫ్యూచర్‌సిటీ కడుతాడంటే పట్టించుకునేదెవరు అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో మూసీని ప్రక్షాళన చేస్తామంటున్న ముఖ్యమంత్రి ఆలోచన, ప్రణాళికపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మూసీ నది పునరుజ్జీవం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రూ.1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు ఒక పెద్ద కుంభకోణమని, కేవలం రూ.16వేల కోట్లతో పూర్తయ్యే పనులకు అంత భారీ మొత్తాన్ని ఎందుకు తగలేస్తున్నారని కేటీఆర్ నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలోనే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కట్టి, పూర్తయిన మూసీ నది ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నాడని ఆరోపించారు.

# పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి

మొదటిపేజీ తరువాయి..

అధికారులు వెల్లడించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చమన్ ఫాటక్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుల్లో ఎక్కువ మంది సైనికులు ఉన్నట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం, జాఫర్ ఎక్స్‌ప్రెస్ క్వెట్టా కాంటోన్మెంట్ స్టేషన్ నుంచి సిటీ రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో పేలుడు సంభవించింది. ఈద్ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఈ రైలులో ప్రయాణిస్తున్నారు. రైలు సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నిండిన ఓ వాహనం రైలు బోగీని ఢీకొట్టడంతో భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.



పేలుడు తీవ్రత ఎంతగా ఉందంటే, రైలు ఇంజిన్‌తో పాటు మూడు బోగీలు పట్టాలు తప్పాయి. అందులో రెండు బోగీలు పూర్తిగా బోల్తా పడ్డాయి. పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు, భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. 10కి పైగా వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయని స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు, పోలీసులు, భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల మధ్య చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత క్వెట్టా నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. మరోవైపు పేలుడు ప్రాంతంలో ప్రజలు గుమిగూడవద్దని పాక్ హోంశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా సాయుధ దళాలను మోహరించారు. భద్రతా కారణాల దృష్ట్యా క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్లాల్సిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే స్టేషన్‌లోనే నిలిపివేశారు. ఇదిలా ఉండగా, ఈ దాడికి తామే బాధ్యులమని నిషేధిత బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. క్వెట్టా కాంటోన్మెంట్ నుంచి సైనికులను తరలిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బీఎల్‌ఏ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. పాక్ ప్రభుత్వం బలోచ్ ప్రజలను అణచివేస్తోందని, తమ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. తమ మాతృభూమి విముక్తి కోసం పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. పాకిస్థాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది పిరికి ఉగ్రవాద చర్య అని వ్యాఖ్యానించారు. దేశంలో భయాందోళనలు సృష్టించడమే ఉగ్రవాదుల లక్ష్యమని అన్నారు. ఇలాంటి దాడులతో దేశ ప్రజల ధైర్యసాహసాలను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను మానవత్వానికి శత్రువులుగా అభివర్ణించిన ఆయన, వారిని కఠినంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ గత కొన్నేళ్లుగా మిలిటెంట్ గ్రూపుల టార్గెట్‌గా మారుతోంది. ముఖ్యంగా బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఈ రైలుపై పలుమార్లు దాడులకు పాల్పడ్డాయి. క్వెట్టా నుంచి పంజాబ్ ప్రాంతాలకు సైనికులను తరలించేందుకు ఈ రైలును తరచూ ఉపయోగిస్తుండటంతో మిలిటెంట్లు దీన్ని లక్ష్యంగా చేసుకుంటున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. 2018లో ఈ రైలుకు సమీపంలో రెండు బాంబులు పేలగా, రిమోట్ కంట్రోల్ సాయంతో దాడి చేసినట్లు అప్పట్లో వెల్లడైంది. 2023లో బోలాన్ జిల్లాలో రైలులో బాంబు పేలి 13 మంది గాయపడ్డారు. అదే ఏడాది మరోసారి జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై పేలుడు దాడి చోటుచేసుకుని ఒకరు మరణించారు. 2024లో క్వెట్టా రైల్వే స్టేషన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 2025లో బోలాన్ జిల్లాలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ ఘటన కూడా సంచలనం సృష్టించింది. ఆ సమయంలో వందలాది మంది ప్రయాణికులను భద్రతా దళాలు సురక్షితంగా రక్షించాయి.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967